విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



అనకాపల్లి | సంపుటి: 3 | సంచిక: 298 | బుధవారం | 02-04-2025 | ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ | పేజీలు : 8 | వెల : 3.00

## ఆయన బటన్లు అన్నీ నేనిచ్చే పెన్షన్‌తో సమానం సీఎం

### - కొత్తగొల్లపాలెం టిడిపి కి కంచుకోట చంద్రబాబు



బాపట్ల : కొత్తగొల్లపాలెం టిడిపి కి కంచుకోట అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మంగళవారం బాపట్ల జిల్లాలో పర్యటించిన సిఎం చినగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో పెన్షన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందించి, ముఖ్యమంత్రి లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తగొల్లపాలెం ప్రజావేదిక సభలో చంద్రబాబు మాట్లాడుతూ ప్రజలే ముందు, ఆ తర్వాతే మిగతా పనులు అని స్పష్టం చేశారు. గత ముఖ్యమంత్రి బటన్ నొక్కామని చెప్పారు, ఆయన బటన్లు అన్నీ నేనిచ్చే పెన్షన్‌తో సమానం. ప్రజా సేవల పేరుతో పెన్షన్ ఇచ్చే కార్యక్రమం చేపట్టా, ముందుండి నడిపించాలనే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నానన్నారు. పెన్షన్లు ఇచ్చేటప్పుడు గౌరవంగా ఇవ్వాలి, ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఏపీ కంటే తక్కువ పెన్షన్ అని తెలిపారు. పెంచిన పింఛన్లను గత ఏప్రిల్ నుంచే అమలు చేస్తున్నాం, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్లు ఇస్తున్నాం. కోటిన్నర కుటుంబాలకు గానూ 64 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నాం. కొందరికి సంపాదించే దానికంటే ఎక్కువ ఆదాయం వస్తోంది. పింఛన్ల పంపిణీ కోసం ఏడాదికి రూ.33,100 కోట్లు ఖర్చవుతోంది. ఒకప్పుడు నొక్కిన బటన్లన్నీ నేను ఇచ్చే పింఛన్లతో సమానం. పింఛన్ల రూపంలో నెలకు రూ.2,722 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గతంలో ఒక నెల పింఛన్ తీసుకోకపోతే ఆ డబ్బు వచ్చే పరిస్థితి లేదు. ఒక నెల తీసుకోకపోతే, రెండు లేదా మూడో నెల తీసుకునే అవకాశం ఇచ్చాం. రెండు నెలలు పింఛన్లు తీసుకోని వారు 93,300 మంది ఉన్నారు. మిగుల్చుకోవాలంటే నెలకు రూ.76 కోట్లు ప్రభుత్వానికి మిగులుతుంది. పేదలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో అదనంగా రూ.76 కోట్లు ఇస్తున్నాం. పేదరికం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని సిఎం కోరారు.




## అన్న ఓదార్పులకు మాత్రమే బయటకు వస్తున్నాడు

బెంగుళూరు : టీడీపీ కి, ఆ పార్టీ దివంగత నేత పరిటాల రవి ఫ్యామిలీ కి కంచుకోటగా చెప్పే రాప్తాడు లో జగన్ త్వరలో పర్యటించనున్నారు. ఏపీ లోని ప్రస్తుత రాజకీయాల్లో వైఎస్ జగన్ వైఖరి పై రకరకాల కామెంట్లు వినిపిస్తుంన్నాయి అనే సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఆయన అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, నాలుగు గోడల మధ్య, ప్రత్యర్థుల విమర్శల ప్రకారం ప్యాలెస్ లలోనే ఎక్కువగా ఉండటానికి ఇష్టపడతారని అంటారు. పైగా ఇప్పుడు ప్రతిపక్ష హోదా కూడా దక్కని అత్యంత దారుణ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ వైఖరి మారినట్లు లేదని చెబుతున్నారు. గత ఎన్నికల్లో 151 స్థానాలు గెలుచుకున్న వైసీపీ, ఇటీవల ఎన్నికల్లో 11 స్థానాలకు పరిమితమైన పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో వీలైనంత ఎక్కువ సమయం ప్రజల్లో ఉండాలని, కార్యకర్తలకు చేరువగా ఉండాలని అందరూ చెబుతుంటారు. అయితే ఏదైనా ప్రమాదం జరిగితేనో, దాడుల్లో తమ కార్యకర్తలు మరణిస్తేనో తప్ప ఆయన దర్శన భాగ్యం దొరకడం లేదనే చర్చలు విరివిగా వినిపిస్తున్నాయి. జగన్ ప్రతిపక్షం లోకి వెళ్లినప్పటి నుంచీ, బెంగళూరు ప్యాలెస్ లోనే ఎక్కువగా గడపడానికి ఇష్టపడుతున్నట్లున్నారనే ప్రచారమూ సర్వత్రా మొదలైదని చెబుతున్నారు. ఈ సమయంలో వీలైనంత ఎక్కువగా జగన్ జనాల్లో ఉండాలని కోరుతున్నారు. ఈ క్రమంలో తాజాగా జగన్ మరోసారి జనాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా త్వరలో రాప్తాడులో కనిపించనున్నారు. టీడీపీ కి, ఆ పార్టీ దివంగత నేత పరిటాల రవి ఫ్యామిలీకి కంచు కోట గా చెప్పే రాప్తాడు లో జగన్ త్వరలో పర్యటించనున్నారు. త్వరలోనే రాప్తాడు వస్తానని, స్థానిక పాపిరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన పార్టీ కార్యకర్త లింగమయ్య కుమరుడితో జగన్ చెప్పారు. దీంతో అన్న ప్యాలెస్ నుంచి బయటకు రాబోతున్నారంటూ (సెటైరికల్) పోస్టులు దర్శనమిస్తున్నాయి. ఇటీవల జరిగిన స్థానిక సంస్థలకు సంబంధించిన ఉప ఎన్నికల్లో వైసీపీ - టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర స్థాయిలో గొడవలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో వైసీపీ ఎంపీటీసీ లను తమవైపు తిప్పుకునేందుకు టీడీపీ అన్ని రకాల ప్రయత్నాలు చేసిందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. ఈ గొడవల నేపథ్యం లోనే పాపిరెడ్డిపల్లికి చెందిన లింగమయ్య పై దాడి జరగడం, దీంతో ఆయన చికిత్స పొందుతూ మరణించడం జరిగింది. అయితే ఈ దాడి చేసింది టీడీపీ నేతలేనని, పరిటాల ఫ్యామిలీ మెంబర్సే ఈ దాడిలో స్వయంగా పాల్గొన్నారని వైసీపీ నుంచి విమర్శలురాగా తమకు ఈ దాడితో ఎలాంటి సంబంధం లేదని పరిటాల సునీత ప్రకటించారు. ఈ సమయంలో వైసీపీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. ఇందులో భాగంగా రాప్తాడు నియోజవర్గం లోని రామగిరి మండలం పాపిరెడ్డి పల్లిలో టీడీపీ గూండాల దాడితో చనిపోయిన కురబ లింగమయ్య కుటుంబానికి జగన్ అండగా నిలిచారని, ఇందులో భాగంగా లింగమయ్య భార్య, ఇద్దరు కుమారులతో ఫోన్ లో మాట్లాడి పరామర్శించారని చెబుతూ, దానికి సంబంధించిన వీడియోను పోస్ట్ చేసింది. అయితే రాప్తాడుకు ఆయన ఎప్పుడు వెళ్తారు, వెళ్లిన తర్వాత తిరిగి తాడేపల్లికి వస్తారా లేక, మళ్లీ బెంగళూరు ప్యాలెస్ కు వెళ్తారా అనే చర్చా అప్పుడే మొదలైందని చెబుతున్నారు.



## ప్రజావేదిక సభలో జై జగన్ నినాదాలు

బాపట్ల: హీరోల సినిమా ఫంక్షన్‌లో మరో హీరో గురించి అరుపులు కేకలు వినపడటం సహజంగానే చూస్తుంటాం. ఈ సంప్రదాయం రాజకీయ సభల్లోకి కూడా వచ్చేసింది. తాజాగా బాపట్ల జిల్లాలో పర్యటించిన సీఎం చంద్రబాబు ప్రజా వేదిక సభలో మాట్లాడుతుండగా, ఓ కుర్రాడు జై జగన్ అని నినాదాలు చేశాడు. దానికి సీఎం చంద్రబాబు చాలా జాగ్రత్తగా రియాక్టయ్యారు. ఒక్క క్షణం ఆగ్రహం వ్యక్తం చేసినా, ఆ వెంటనే తన స్థిత ప్రజ్ఞతతో వ్యవహరించారు. బాపట్ల జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా చిన్నగంజాం మండలం కొత్త గొల్లపాలెంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న చంద్రబాబు అనంతరం నిర్వహించిన ప్రజా వేదిక సభలో పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఓ ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో సభలో పాల్గొన్న ఓ యువకుడు, జై జగన్ అంటూ నినాదాలు చేశాడు. దీంతో ఒక్కసారిగా సభ అంతా ఒక్కసారిగా ఆ నినాదాలు వచ్చిన వైపు చూసింది. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు తనదైన శైలిలో రియాక్టయ్యారు. మొదట కాస్త ఆగ్రహానికి గురైన చంద్రబాబు, వెంటనే తన రాజకీయ అనుభవంతో ఈ సందర్భాన్ని డీల్ చేశారు. ఓవైపు నవ్వుతూనే ఆ నినాదాలు చేసిన యువకునికి సున్నితంగా వాతలు అంటించారు. మనకు ఎప్పుడూ కూడా సమాజంలో మంచి ఉంటుంది, చెడు ఉంటుంది. ఇప్పుడు ఒక కుర్రాడొచ్చాడు, అతను ఏ గ్రామం నుంచి వచ్చాడో నాకు తెలియదు. అతనికి కడుపు నొప్పి ఉంటే, డాక్టర్ దగ్గరకు వెళ్లాలి. వేరే ఏదైనా బాధ ఉంటే నా దగ్గరకు రావాలి. కానీ, ఇలా కేకలు వేస్తే, అతని కడుపు నొప్పి పెరుగుతుంది. అది అతను మర్చిపోతున్నాడు. ఇంత మంది పవిత్రమైన యజ్ఞం గురించి ఆలోచిస్తుంటే, ఒక రాక్షసుడు వచ్చి అరిస్తే ఏమవుతుంది. ఒక రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి చెప్పిన మాటలు వింటే ఆవేశం వస్తుంది, ఎగిరెగిరి పడతారు, ఇలాగే కేకలు వేస్తారు. కానీ గౌరవంగా వచ్చి చెప్తే వినడానికి నేను సిద్ధంగా ఉంటాను. ఆ సమస్యను పరిష్కరించగలనంటే, కచ్చితంగా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాను. నేను పగలు, రాత్రి కష్టపడి పని చేస్తున్నాను, చిన్న సమస్య అయినా, పెద్ద సమస్య అయినా, వినడానికి సిద్ధంగా ఉంటాను. న్యాయసమ్మతమైన సమస్య అయితే, దానిని పరిష్కరిస్తాను, లేకపోతే వేరే ఏదైనా మార్గం చూసే ప్రయత్నం చేస్తాను. కేకలు వేస్తూ, బెదిరిస్తూ వస్తే, కడుపు నొప్పి వచ్చిందంటే, ననేేం చేయను, ప్రజలు ఇది అర్థం చేసుకోవాలి. రాజకీయాల్లో ఎంతో మంది వ్యక్తులను చూశాను, వారు చిన్న విషయాలను పెద్దవిగా చేసి అందరి దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తారు, అది మంచిది కాదు, సమాజంలో కూడా అలాంటి వ్యక్తులను చూశాను. ఎక్కడైనా తోకాడించవచ్చు కానీ నా దగ్గర తోకాడిస్తే కుదరదు. 43 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. ఎవరైనా సరే ఆవులిస్తే పేగులు లెక్కపెడతాను. పవిత్రమైన యజ్ఞం చేస్తుంటే, దానికి మద్దతు ఇవ్వాలి, మద్దతు ఇవ్వలేకపోతే, ఏదైనా సమస్య ఉంటే, నన్ను కలిసి చెప్పండి. నేను ఎప్పుడూ అందుబాటులో ఉంటాను. రోజుకు 24 గంటలు అందుబాటులో ఉంటాను. నేను వెళ్తుంటే కాగితం ఇచ్చినా మీ ఫిర్యాదును తీసుకొని, కలెక్టర్‌కి ఇచ్చి సమస్యను పరిష్కరించేలా చూస్తాను. అంటూ చంద్రబాబు తనదైన శైలిలో రియాక్ట్ అయ్యారు. చంద్రబాబు స్థితప్రజ్ఞతకు సభలో ఉన్నవాళ్లంతా చప్పట్లతో అభినందించారు.



## ఏటీఎం సైజులో కొత్త రేషన్ కార్డుల జారీ నాదెండ్ల



అమరావతి పెన్ సత్తా : రాష్టంలో కొత్త రేషన్ కార్డు లపై ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత లబ్దిదారులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల జారీ పై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం నడుస్తున్న ఈ-కేవైసీ ప్రక్రియ తర్వాత రేషన్ కార్డుల జారీ ఎప్పుడూ చేస్తారన్న దాని పై ఆయన క్లారిటీ ఇచ్చేసారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల్ని మే నెల నుంచి జారీ చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం స్పష్టంగా ప్రకటించారు. మే నుంచి ఏటీఎం కార్డు సైజులో కొత్త రేషన్ కార్డులు జారీ చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ 30 వ తేదీతో ఈ కేవైసీ ప్రక్రియ ముగుస్తున్నందున ఆ వెంటనే కొత్త రేషన్ కార్డుల జారీ ప్రారంభిస్తామన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న ఫ్యామిలీ రేషన్ కార్డునే సైజు తగ్గించి అన్ని వివరాలతో వీటిని జారీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. మరో వైపు రాష్ట్రంలో కొత్త కార్డుల జారీ సమయం లోనే కుటుంబ సభ్యుల పేర్ల జోడింపులు, తొలగింపులు, స్ప్లిట్ కార్డుల కోసం ఆప్షన్లు కూడా ఇవ్వబోతున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అలాగే క్యూఆర్ కోడ్ లాంటి భద్రతా ఫీచర్లతో కొత్త రేషన్ కార్డులు జారీ అవుతాయని ఆయన వెల్లడించారు. అలాగే ఈసారి రేషన్ కార్డుల పై ఎవరీ బొమ్మలూ ఉండవని మంత్రి క్లారిటీ ఇచ్చారు. మొత్తం మీద రాష్ట్రంలో ఈ కే వైసీ పూర్తి అయిన తర్వాత ఎంతమందికి కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వాలన్న దాని పై ప్రభుత్వానికి క్లారిటీ వస్తుందని మంత్రి తెలిపారు.

## నేడు లోక్ సభకు వక్ఫ్ బిల్లు

న్యూ ఢిల్లీ : వక్ఫ్ సవరణ బిల్లును నేడు (బుధవారం) పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధమైంది. నేడు లోక్ సభలో వక్ఫ్ సవరణ బిల్లును మైనారిటీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు లోక్ సభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం 12.15 నిమిషాలకు ఈ బిల్లు పై సభలో చర్చ జరగనుంది. ఈ తరుణంలో బిజెపి ఎంపీలంతా రేపు లోక్ సభలో ఉండాలని ఆ పార్టీ అధిష్టానం విప్ జారీ చేసింది. అయితే ప్రతిపక్ష ఎంపీలు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారు. కాగా, ఈ బిల్లు పై ఎనిమిది గంటలపాటు చర్చ జరగనుంది. ఈ బిల్లుకు అనుకూలంగా 298 మంది ఎన్డీఏ ఎంపీలు ఉన్నారు. ఈ క్రమంలోనే బీజేపీ ఎంపీలంతా లోక్ సభకు హాజరుకావాలని విప్ జారీ చేశారు.



# సంపాదకీయం

# యువతలో ఫ్యాటీ లివర్ డేంజర్

భారతదేశంలో ఫ్యాటీ లివర్ (కొవ్వు కాలేయం) కేసులు రానురాను ముంచుకొస్తున్నాయి. ఈ కేసుల ప్రాబల్యం 9 శాతం నుంచి 38 శాతం వరకు అమాంతంగా పెరిగిందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 2023 లో ఎయిమ్స్ నిర్వహించిన అధ్యయనంలో దాదాపు 35 శాతం కేసులు పిల్లల్లోనే సంభవిస్తున్నాయని గుర్తించారు. గతంలో ప్రతి 1015 మందిలో ఒకరికి ఈ సమస్య గుర్తిస్తే ప్రస్తుతం ప్రతి ఇద్దరిలో ఒకరికి ఫ్యాటీలివర్ కనిపిస్తోంది. ప్రస్తుతం దేశంలో 30 కోట్ల నుంచి 40 కోట్ల వరకు ఫ్యాటీ లివర్ బాధితులున్నారు. ముఖ్యంగా యువతలో ఫ్యాటీలివర్ ముప్పు పెరుగుతోంది.ఐటి ఉద్యోగుల్లో పని ఒత్తిడి, కదలికలేని నిశ్చల జీవనశైలి, కారణంగా 80% మందిలో ఫ్యాటీ లివర్ పొంచి ఉంటోందని వైద్య నిపుణుల అధ్యయనాలు చెబుతున్నాయి. శరీరంలోని ప్రతి అవయవాన్ని సక్రమంగా పనిచేయించే బాధ్యత తీసుకునేది కాలేయమే. కాలేయం జీర్ణవ్యవస్థకు అనుబంధంగా ఉన్న అతిపెద్ద గ్రంథి. ఇది 500కు పైగా ప్రాణాధార పనులు చేస్తుందని, కొవ్వు దశలవారీ పెరిగిపోతే కాలేయం తన విధులను నిర్వర్తించడం మానేస్తుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఆహారం మొదలు మందుల వరకు కాలేయం మీదుగానే ప్రయాణం సాగిస్తాయని అంటున్నారు. కాలేయ కణజాలంలో 5% కంటే ఎక్కువ కొవ్వు ఉన్నప్పుడు ఫ్యాటీ లివర్ వ్యాధి వస్తుంది. ఫ్యాటీలివర్ తనకుతాను ప్రమాదకారి కాకపోయినా, దీని లక్షణాలు సకాలంలో గుర్తించకపోతే సింపిల్ ఫ్యాటీ లివర్, ఇన్‌ఫ్లమేషన్ (స్టీటోహెపటిటిస్),ఫైబ్రోసిస్, సిర్రోసిస్ అనే నాలుగు దశల్లో ఫ్యాటీ లివర్ పెరిగిపోతుంది. సిర్రోసిస్ పెరిగితే కాలేయం దెబ్బతినడం శాశ్వతమవుతుంది. కాలేయం పూర్తిగా చెడిపోతేనే కానీ ఫ్యాటీలివర్ (కొవ్వు కాలేయం) లక్షణాలు బయటపడవు. ఫ్యాటీ లివర్ ప్రారంభంలో కనిపించే లక్షణాలపై ఎవరికీ అవగాహన సరిగ్గా ఉండడం లేదు. అందుకని ఫ్యాటీ లివర్ కేసులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. ఈ లక్షణాలపై అవగాహన కల్పించడానికి కొన్ని వైద్య సంస్థలు ప్రచారాన్ని ప్రారంభించాయి. ఫ్యాటీ లివర్‌ను చికిత్స చేయకుండా వదిలేస్తే ఇది సిర్రోసిస్, కాలేయ క్యాన్సర్‌తో సహా మరింత తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ఫ్యాటీలివర్ వ్యాధులు ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎఎఫ్ఎల్‌డి), నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎన్ఎఎఫ్ఎల్‌డీ) అనే రెండు రకాలు. మద్యపానం వల్ల ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎన్ఎఎఫ్ఎల్‌డి) చాలా మంది యువకుల్లో సర్వసాధారణంగా కనిపిస్తుంది. ముఖ్యంగా జీవక్రియ రుగ్మతలు (మెటబాలిక్ డిజార్డర్లు) అంటే ప్రొటీన్లు, కొవ్వులు, కార్బొహైడ్రేట్లు వంటి స్థూలపోషకాలను శరీరంలో నిర్వహించడం, పంపిణీని చేయడం వంటి ప్రక్రియలు సరిగ్గా జరగకపోవడం వల్ల వచ్చే రుగ్మతలు. శరీరంలో సాధారణ జీవక్రియను అసాధారణ రసాయన ప్రతిచర్యలు మార్చినప్పుడు జీవక్రియ రుగ్మతలు సంభవిస్తాయి. అలాంటి రుగ్మతలు ఉన్నవారిలో ఎన్ఎఎఫ్ఎల్‌డి కనిపిస్తుంది. ఆల్కహాలు అలవాటు లేని వారిలో అధిక బరువు, మధుమేహం, కొలెస్ట్రాల్, థైరాయిడ్ సమ్యలతో నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ ముప్పు పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే కాలేయం వాపు వచ్చి, సరిగ్గా పనిచేయలేని పరిస్థితి ఏర్పడితే హెపటిటిస్ వ్యాధి ఏర్పడుతుంది. వైరల్ వ్యాపించడం వల్ల ఇది దాపురిస్తుందని వైద్యులు చెబుతున్నారు. 2030 నాటికి హెపటిటిస్‌ను పూర్తిగా నిర్మూలించాలన్న లక్షాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశిస్తోంది. ఏటా జులై 28 ని ప్రపంచ హెపటిటిస్ దినంగా పరిగణిస్తున్నారు. రొటీన్‌గా హెల్త్ స్క్రీనింగ్ చేసేటప్పుడు ఈ కేసులు బయటపడుతున్నాయని డాక్టర్లు పేర్కొంటున్నారు. 2021లో 50 అధ్యయనాల నుంచి వెలువడిన 62 డేటాలను విశ్లేషించగా, దేశంలోని పెద్దల్లో 38 శాతం మందికి ఎన్ఎఎఫ్ఎల్‌డీ ఉన్నట్టు బయటపడింది. ఈ కేసుల్లో 53.5 శాతం చండీగఢ్ కేసులే కనిపించాయి. అలాగే పిల్లల్లో 35 శాతం వ్యాపించినట్టు బయటపడింది. ఎందుకు ఈ విధంగా కేసులు అకస్మాత్తుగా పెరిగిపోతున్నాయని పరిశీలిస్తే నగరీకరణ విస్తరించి ఆధునిక జీవనశైలి లోను, ఆహారపు అలవాట్లలోను వస్తున్న మార్పులే ఎక్కువగా ఈ కేసులు పెరగడానికి కారణమవుతున్నాయని తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ఈ కేసుల ప్రాబల్యం 16 నుంచి 32 శాతం వరకు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం వరకు ఉంటోంది. కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో చాలా ఐటి కంపెనీలు వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని అనుసరించాయి. కొన్ని కంపెనీలు ఈ పద్ధతిని ఇప్పటికీ కొనసాగిస్తున్నాయి.శరీర కదలికలు లేని నిశ్చల జీవన విధానం, శారీరక వ్యాయామం లేకపోవడం ఒక కారణం కాగా, అధిక కార్బోహైడ్రేట్, మసాలా దినుసులు, కొవ్వు, ఉప్పు అధిక శాతం ఉండే జంక్‌ఫుడ్ ఆరగించడం మరో ప్రధాన కారణమవుతోంది. ఫలితంగా ఎన్ఎఎఫ్ఎల్‌డి ఫ్యాటీలివర్ కేసులకు ఊతం పెరుగుతోంది. అందువల్ల ప్రాసెస్ చేసిన ఆహారాన్ని, చక్కెర పదార్థాలను పరిమితం చేయాలి. ఎన్ఎఫ్ఎల్‌డికి మెటబాలిక్ సింర్రోమ్‌తో బలమైన సంబంధం ఉంటుంది. మెటబాలిక్ సింర్రోమ్ అంటే పలు జీవప్రకియల్లో ఏర్పడే విపరీత పరిణామాల వల్ల కలిగే ఇబ్బందుల సమాహారం. ఈ ఇబ్బందులు దీర్ఘకాలిక జబ్బులైన గుండెపోటు, అధిక రక్తపోటు, టైప్ 2 డయాబెటిస్‌కు దారితీస్తాయి. అయితే ఫ్యాటీలివర్ కేసులు పెరగడానికి ప్రధానంగా పిఎన్‌పిఎల్‌ఎ 3 అనే జన్యువు కీలకపాత్ర పోషిస్తున్నట్టు నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిఎన్‌పిఎల్‌ఎ 3 జన్యువు మన శరీరంలో అడిపోన్యూట్రిస్ అనే ప్రొటీన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది కొవ్వులో, కాలేయ కణాల్లో ఉండి కొవ్వు ఉత్పత్తి, విచ్ఛిన్నతను నియంత్రించడానికి సహకరిస్తుంది. ఆహారంలోని కొవ్వులను ప్రాసెస్ చేయడానికి, నిల్వ చేయడంలో సాయపడడానికి, నియంత్రించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఈ జన్యువుకు హెపాటోసెల్లర్ కార్సినోమా, స్టీటోసిస్, ఫైబ్రోసిస్ వంటి కాలేయ వ్యాధులతో సంబంధం కలిగి ఉంటుంది. ఈ జన్యువు పనితీరు కోల్పోతే హైపటోసైట్ (కాలేయ కణాల)లో ట్రైగ్లిజరైడ్ చేరడమే కాక, ఫ్యాటీ లివర్‌కు దారి తీస్తుంది. సాధారణంగా స్త్రీలలో కాలేయం 7 సెంమీ, పురుషుల్లో 10.5 సెంమీ వరకు పరిమాణం ఉంటుంది. ఫ్యాటీ లివర్ అయితే సాధారణ పరిమాణం కంటే 2 నుంచి 3 సెం.మీ ఎక్కువ ఉంటుంది. ఫ్యాటీ లివర్ రక్తపరీక్షలతో పాటు అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లో బయటపడుతుంది. ఉదర భాగంలో కుడివైపు నొప్పి కలిగితే లివర్ సమస్య ఉన్నట్టు భావించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఫ్యాటీ లివర్ చికిత్సకు హెపటోప్రొటెక్టివ్ ఏజెంట్లు, మెటబాలిక్ సింర్రోమ్‌టార్గెట్ చేసే డ్రగ్స్, న్యూట్రాస్యూటికల్స్ వినియోగిస్తారు. ఫ్యాటీ లివర్ చికిత్సను హెపాటిక్ స్టీటోసిస్ చికిత్స అని కూడా పిలుస్తారు. పెరిగిన రక్తలిపిడ్ స్థాయిలను పూర్వస్థితికి తీసుకురావడం, ఇన్సులిన్ సెన్సిటివిటీ సాధారణీకరణ, వంటి వాటిపై ఈ ఫ్యాటీ లివర్ చికిత్స ఆధారపడి ఉంటుంది. 2019లో నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఊబకాయం ఉన్న రెండేళ్ల వయసు పిల్లల్లో కూడా ఫ్యాటీలివర్ ప్రాబల్యం కనిపిస్తోంది. ఇలాంటి పిల్లల్లో పొత్తికడుపు అసౌకర్యంగా ఉండడం, అలసట, కండరాల నొప్పి, ఉబ్బరం, యాసిడ్ రిఫ్లక్స్ (ఉదరంలోని ఆమ్లంపైకి ప్రవహించడం)ఎక్కువగా నిద్రపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇక స్త్రీలల్లో ఫ్యాటీ లివర్ కేసులు చాలా తక్కువ. అయితే గర్భధారణ సయయంలో హార్మోన్ల మార్పులు, మెనోపాజ్ (రుతుక్రమం ముగింపు) వల్ల ఫ్యాటీ లివర్ వచ్చే ముప్పు కలుగుతుంది. ఈ వ్యాధి పెరుగుతున్నప్పుడు అలసట, ఉదర అసౌకర్యం, కాళు లేదా పొత్తి కడుపులో ద్రవం ఏర్పడటం (ఎడీమా) వంటి లక్షణాలు కనిపిస్తాయి. గర్భం దాల్చిన 20 వారాల తరువాత కాలేయం పని చేయకపోవడం క్లినికల్ పరీక్షల్లో బయటపడుతుంది. వికారంగా ఉండడం, వాంతులు, ఆకలి లేకపోవడం, పొత్తికడుపులో నొప్పి, తలనొప్పి, గందరగోళం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంత మంది రోగులకు అధిక రక్తపోటు, మూత్రంలో ప్రొటీన్ కూడా ఉండవచ్చు. రక్తస్రావం, రక్తలో తక్కువ చక్కెర స్థాయిలు ఇవన్నీ కాలేయ వైఫల్యానికి సూచనలని చెప్పవచ్చు. అందుకనే ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవడమే కాక, రోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేస్తే కాలేయం పదిలంగా ఉండడానికి వీలవుతుంది. తక్కువ కార్బోహైడ్రేట్లు కలిగిన కిటోజెనిక్ డైట్ వల్ల ఇలాంటి ముప్పు చాలా వరకు తగ్గుతుందని అమెరికాలోని కెంటకీ యూనివర్శిటీ పరిశోధకులు వెల్లడించారు. కిటోజెనిక్ డైట్ అంటే ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారం. వేపుళ్లు, చిరుతిళ్లు, నూనె పదార్థాలు కావు. గింజలు, మాంసాహారం, చేపలు వంటివి కిటోజెనిక్ డైట్ కిందకు వస్తాయి. కార్బోహైడ్రేట్లు 50 గ్రాములు మోతాదుకన్నా తక్కువగా ఉండేలా ఆహారం తీసుకోవాలి. కిటోజెనిక్ ఆహారం వల్ల మెదడు లోని నాళాలు చైతన్యవంతం కావడమే కాక, నరాల క్షీణత కూడా తగ్గుతుందని చెబుతున్నారు. అలాగే ఇలాంటి డైట్ వల్ల తెలివితేటలు, జ్ఞాపకశక్తి పెరుగుతాయని పరిశోధకులు చెబుతున్నారు. అందువల్ల ఫ్యాటీ లివర్‌ను నివారించడానికి సరైన పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం చాలా అవసరం.

# ఓటర్ల జాబితా ఆధునీకరణ పై 5 వేల సమావేశాలు

**న్యూ ఢిల్లీ :** ఓటర్ల జాబితాలను ఆధునీకరించడంతో సహా పెండింగ్‌లో వున్న అంశాలన్నింటి పై దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలతో కింది స్థాయిలో దాదాపు 5 వేల సమావేశాలను నిర్వహించినట్లు భారత ఎన్నికల సంఘం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటి వరకు ఇసి చేపట్టిన కార్యక్రమాల్లో ఇదే అతి పెద్దదని తెలిపింది. రాజకీయ పార్టీలకు చెందిన 28 వేల మంది ప్రతినిధులతో కమిషన్ సమావేశాలు నిర్వహించిందని, నకిలీ ఓటరు కార్డులు, ఓటర్ల జాబితాలో అవకతవకలు వంటి పలు ఆరోపణలు అనేక రాజకీయ పార్టీల నుండి వచ్చిన నేపథ్యంలో ఈ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపింది. ఓటర్ల నమోదు అధికారి (ఇఆర్‌ఓ), జిల్లా ఎన్నికల అధికారి (డిఇఓ), ముఖ్య ఎన్నికల అధికారి (సిఇఓ) స్థాయిల్లో ఈ సమావేశాలు జరిగాయని పేర్కొంది. మార్చి 31 నాటికి 25 రోజుల వ్యవధిలో మొత్తంగా 4,719 సమావేశాలు నిర్వహించగా వీటిల్లో సిఇఓలతో 40 సమావేశాలు, డిఇఓలతో 800, ఇఆర్‌ఓలతో 3,879 సమావేశాలు జరిగినట్లు పేర్కొంది. సిఇసి జ్ఞానేష్ కుమార్, ఇతర కమిషనర్లు జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా ఈ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు ఇసి తెలిపింది.




# పవన్‌పై కేసు.. ప్రజా ప్రతినిధుల కోర్టుకు ఎలా పంపాలో చెప్పండి

**- ఇరుపక్షాలను ప్రశ్నించిన హైకోర్టు**

**అమరావతి పెన్ సత్తా :** డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ విపక్షంలో ఉండగా ఎమ్మెల్యే కాదని, ఆ సమయంలో వలంటీర్ల గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారనే కేసును ప్రజాప్రతినిధుల కోర్టుకు ఎలా పంపాలో చెప్పాలని ఇరుపక్షాలను హైకోర్టు కోరింది. పవన్ వ్యాఖ్యల పై గతం లోని రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు కోర్టులో వేసిన పరువు నష్టం కేసును, విజయవాడ ప్రజా ప్రతినిధుల కేసులను విచారించే ప్రత్యేక కోర్టుకు పంపాలన్న పిటిషనర్ వాదనల పై పైవిధంగా సందేహాన్ని వ్యక్తం చేసింది. తమ సందేహాలను నివృత్తి చేయాలని పిటిషనర్‌తో పాటు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జున రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు. వలంటీర్ల వల్లే ఆడ పిల్లలు మాయమవుతున్నారంటూ 2023 లో ఏలూరులో జరిగిన వారాహి యాత్రలో పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. పెద్ద సంఖ్యలో ఆడ పిల్లలు కనిపించకుండా పోవడం వెనుక వలంటీర్లు ఉన్నారనే వ్యాఖ్యలు ప్రభుత్వ పరువు, ప్రతిష్టకు నష్టం కలిగించే విధంగా ఉన్నందున పవన్ పై క్రిమినల్ కేసు దాఖలు చేయాలని గుంటూరు కోర్టు పిపిని ఆదేశిస్తూ అప్పటి ప్రభుత్వం జిఓ జారీ చేసింది. తర్వాత పవన్ పై క్రిమినల్ కేసు నమోదైంది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే, పరువు నష్టం కేసులో ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి నివ్వాలంటూ కోర్టులో పిపి కేసు వేశారు. దీంతో గుంటూరు కోర్టు ప్రాసిక్యూషన్ ఉపసంహరణకు అనుమతినిస్తూ గతేడాది నవంబర్ 18న ఉత్తర్వులిచ్చింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పలువురు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు.




# అరకు కాఫీ కి గ్లోబల్ గుర్తింపు ఆనంద్ మహీంద్ర

**అమరావతి పెన్ సత్తా :** ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాజం నుంచి పుట్టిన అరకు కాఫీ, ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. ఈ విభిన్న రుచిని ప్రపంచానికి పరిచయం చేసిన గిరిజన రైతులు, వారి కృషికి గుర్తింపుగా అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఈ విజయాన్ని మహీంద్రా గ్రూప్ అధినేత ఆనంద్ మహీంద్ర ప్రశంసించగా, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు కూడా అభినందనలు తెలియజేశారు. ఆనంద్ మహీంద్ర ట్వీట్ అరకు కాఫీ కి ప్రోత్సాహం. మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర తన ట్విట్టర్ ఖాతా ద్వారా అరకు కాఫీ ప్రయాణాన్ని ప్రశంసించారు. బీన్ నుండి కప్పు వరకు అరకు కాఫీ యొక్క ప్రయాణం గిరిజన రైతుల కృషికి అద్దం పడుతోంది. ఇది ఒక ఆదర్శ ప్రాజెక్ట్ అని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు, ఈ కాఫీ కి గ్లోబల్ మార్కెట్‌లో లభిస్తున్న ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. ఆయన అభిప్రాయానికి అంగీకరిస్తూ, అరకు కాఫీ బ్రాండ్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు కృషి చేయాలని సూచించారు. చంద్రబాబు కి అభినందనలు మేడ్ ఇన్ ఏపీ గ్లోబల్ గుర్తింపు ఆనంద్ మహీంద్ర చేసిన ట్వీట్ కు రీట్వీట్ చేసిన సీఎం చంద్రబాబు, అరకు కాఫీ ప్రాముఖ్యతను మరోసారి నొక్కి చెప్పారు. పచ్చని అరకులోయలో పుట్టిన కాఫీ, పారిస్ నడి బొడ్డుకు చేరడం గర్వకారణం. గిరిజన రైతుల కృషికి ఇది నిజమైన గౌరవం. మేడ్ ఇన్ ఏపీ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయి అని పేర్కొన్నారు. అరకు కాఫీ గిరిజన రైతుల కృషి, అరకు కాఫీ ప్రత్యేకత దాని నాణ్యత మాత్రమే కాదు, దాని వెనుక ఉన్న గిరిజన రైతుల సంకల్పం, పట్టుదల. ఆర్గానిక్ ఫార్మింగ్ విధానాలను పాటిస్తూ, అధిక నాణ్యత గల అరబికా కాఫీ ని ఈ ప్రాంత రైతులు ఉత్పత్తి చేస్తున్నారు. వారి శ్రమ, మెరుగైన ప్రాసెసింగ్, మార్కెటింగ్ విధానాలు ఈ కాఫీ ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాయి. అంతర్జాతీయ గుర్తింపు పారిస్‌లో అరకు కాఫీ అరకు కాఫీ ప్రత్యేక రుచి, ఫ్రెష్ అరబికా బీన్స్ ద్వారా పాపులర్ అయ్యింది. పలు అంతర్జాతీయ వేదికలలో, ముఖ్యంగా పారిస్‌లో ఈ కాఫీ కి మంచి మార్కెట్ ఏర్పడింది. ఫ్రాన్స్, జపాన్, యూఎస్ఏ వంటి దేశాల్లో అరకు కాఫీ కి భారీ డిమాండ్ ఉంది. గిరిజన అభివృద్ధికి అరకు కాఫీ ఓ ప్రేరణ, అరకు కాఫీ విజయవంతమైన కథ, గిరిజన రైతులకు ఆదర్శంగా నిలుస్తోంది. స్వయం సహాయ సమూహాలు, సహకార సంఘాల ద్వారా ఈ కాఫీ ఉత్పత్తి, మార్కెటింగ్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇది కేవలం కాఫీ గమనాన్ని మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించడానికి మార్గదర్శిగా మారింది. పచ్చని అరకులోయలో పుట్టిన అరకు కాఫీ, తన నాణ్యత, ప్రత్యేకత, గిరిజన రైతుల కృషి ఇప్పుడు ప్రపంచమంతా గుర్తించేలా చేసింది. ఆనంద్ మహీంద్ర, చంద్రబాబు నాయుడు వంటి ప్రముఖుల నుంచి పొగడ్తలు అందుకోవడం, గిరిజన రైతులకు మరింత ఉత్సాహాన్నిస్తుంది.



# పింఛన్లు పంపిణీ చేసిన జిల్లా ప్రత్యేక అధికారి గిరీషా పి.ఎస్, జిల్లా కలెక్టర్

**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 01 :** ఎన్.టి.ఆర్. భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి గిరీషా పి.ఎస్, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పాల్గొని పింఛన్ లు పంపిణీ చేశారు. పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామంలో మాసవరపు వీధిలో నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి దివ్యాంగు లైన లాలం శ్రావణికి, వితంతువు గుండా సోమమ్మకు ఎన్టీఆర్ భరోసా వృద్ధాప్య పింఛనుతో పాటు అభయ హస్తం పింఛను అందించారు. లాలం సింహాచలం కు ఎన్.టి.ఆర్. భరోసా వృద్ధాప్య పింఛన్లను పంపిణీ చేశారు. ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆడియో సందేశాన్ని చరవాణి ద్వారా లబ్ధిదారులుకు వినిపించారు. పింఛన్లు అందుతున్న తీరును లబ్ధిదారులకు అడిగి తెలుసుకున్నారు. కనీస పింఛను నాలుగు వేల రూపాయలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఎన్ టి ఆర్ భరోసా సామాజిక పింఛన్లు కింద వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు, కదల లేని స్థితిలో ఉన్నవారికి, కళాకారులకు తదితర అన్ని రంగాలకు చెందిన వాటికి కనీస పింఛను నాలుగు వేల రూపాయలు కాగా గరిష్టంగా పదిహేను వేల రూపాయలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. శచిదేవి, పరవాడ మండలం ఎంపీడీఓ.కె ధర్మారావు, తహసీల్దార్ అంబేద్కర్, పరవాడ మండలం జనసేన పార్టీ ఇంచార్జి పంచకర్ల ప్రసాద్, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పల నాయుడు, పరవాడ మండలం టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.







# జిల్లాను నాటు సారా రహితంగా మార్చడమే నవోదయం 2.0 ఉద్దేశ్యం

**- నాటుసారా తయారీ పై టోల్ ఫ్రీ నెం 14405 కు సమాచారమివ్వండి**

**అనకాపల్లి,పెన్ సత్తా, ఏప్రిల్ 01 :** అనకాపల్లి జిల్లా ను నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే నవోదయం 2.0 ప్రధాన ఉద్దేశ్యం అని, ఆ దిశగా జిల్లాలో సమూలంగా నాటు సారాను నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అద్వర్యంలో నాటుసారా నిర్మూలనా కార్యక్రమం నవోదయం 2.0 పై పోలీస్, అటవీ, పంచాయతి రాజ్, గిరిజన శాఖ లతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా, నాటుసారాను నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించింద న్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకొని ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అనకాపల్లి జిల్లా చుట్టూ చాలా జిల్లాల సరిహద్దు ప్రాంతాలను కలిగి వుండడంతో ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీలు మరింత సూక్ష్మ దృష్టిని సారించాలన్నారు. నవోదయం 2.0 పై ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ కార్యక్రమం సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో కమిటీ లను నియమించాలన్నారు. నియమించ డంతో పాటు వారు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలను అవగాహన పరచాలన్నారు. నాటుసారా నిర్మూలనకు గ్రామస్థాయి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలలో అవగాహన సదస్సులు, ముఖ్యంగా మహిళలతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నాటు సారా వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించాలని, నాటు సారా సేవించడం వల్ల కలిగే ప్రమాదాల పై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. రెండు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం అమలు పై అన్ని అనుబంధ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా లో ఐ డి లిక్కర్ (అక్రమ స్వేదన మద్యం) పీడిత గ్రామాల జాబితాను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించడం జరిగిందని, ఏ కేటగిరీలో 21 గ్రామాలు, బి కేటగిరిలో 45 గ్రామాలు, సి కేటగిరిలో 85 గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. ఆయా గ్రామాల్లో నాటు సారాను నిర్మూలించి, ప్రభుత్వ లక్ష్యం చేరుకునేలా పనిచేయాలన్నారు. మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకొని ఎమ్మార్వో అధ్యక్షతన నాటు సారా వల్ల దుష్ప్రభావాల పై సమావేశం నిర్వహించు కోవాలని తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి ప్రత్యామ్నాయంగా గొర్రెలు, ఆవులు పట్టించి ఇవ్వడం, దుకాణాలు, తదితర పనులతో ఉపాధి పొందేలా బ్యాంకు రుణాలు ఇప్పించేందు కు సహకరించడం జరుగుతుందన్నారు. నాటు సారా తయారీ, రవాణా విక్రయాలు కొనసాగించే వారి పై ఇక పై కఠిన చర్యలు ఉంటాయని, తొలుత తహశీల్ధారు వద్ద రూ. లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. తర్వాత ఏడాది పాటు బెయిల్ రాకుండా పిడి యాక్ట్ నమోదు అవుతుందన్నారు. కనుక ఈ నేరం చేసిన వారికి 8 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు, రూ 5 లక్షల వరకు జరిమానా విధించ బడుతుందని, ప్రజలకు వివరించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా నాటు సారా తయారుచేసినా, రవాణా చేసినా, నిల్వచేసినా, అమ్మకాలు జరిపినా 14405 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అన్నారు, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన కూడలిలో నాటు సారా నిర్మూలన కార్యక్రమం పై విస్తృతంగా చిన్న సైజు హోర్డింగ్ లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ వృత్తి నుండి వారి కుటుంబాలను దూరం చేసి సమాజంలో గౌరవప్రదమైన ఉపాధి మార్గాలను వారికి కల్పించేలా ప్రభుత్వం కల్పించే సంబందిత రాయితీలను, పథకాలను అందేలా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే ఏడాది నాటికి జిల్లాను నాటు సారా రహితంగా మార్చే లక్ష్యంగా, నాటు సారా నిర్మూలన పై క్షేత్రస్థాయిలో తనిఖీలు జరగాలని, సమావేశాలను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. సమస్యాత్మకంగా ఉన్న గ్రామాల్లో నిర్వహించే సమావేశాలకు ఎస్హెచ్వోలు హాజరు కావాలన్నారు. గుర్తించిన ఏ, బీ, సీ కేటగిరీల గ్రామాల పై దృష్టి పెట్టాలని, జిల్లాను, రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ప్రతి ఒక్కరు పని చేయాలని ఆదేశించారు. గతంలో నాటుసారా తయారు చేసే వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సూర్జిత్ సింగ్, జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి వి సుదీర్, జిల్లా అటవీశాఖ అధికారి శామ్యూల్, జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్ ) మోహన్ రావు,జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగ శిరీషా, ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# మీ క్రమ శిక్షణ, అంకిత భావమే ఉద్యోగులకు స్ఫూర్తిదాయకం

**- ఆత్మీయ వీడ్కోలు సభలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**

**విజయనగరం పెన్ సత్తా:** సుదీర్ఘ కాలం పోలీసు శాఖలో బాధ్యతాయుతంగా, ఎంతో క్రమ శిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పోలీసు కంట్రోల్ రూం ఎస్సై ఎన్ని సత్యానందరావు, గుర్ల పి.ఎస్., హెచ్.సి ఎ.భాస్కరరావు లను జిల్లా పోలీసుశాఖ తరుపున జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖకు సుదీర్గ కాలం మంచి సేవలందించి నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్సై ఎన్ని సత్యానందరావు, హెడ్ కానిస్టేబుల్ అదపాక భాస్కర రావు లకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు విధులను నిర్వహించడంలో క్రమశిక్షణ, అంకిత భావంతో పనచేసి, ఇతర పోలీసు ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. పోలీసు ఉద్యోగంలో ప్రతీ రోజూ ఒక కొత్త రకమైన సవాళ్ళు ఎదురవుతూనే ఉంటాయని, వాటిని సమయస్ఫూర్తితో ఎదుర్కొని, సవాళ్ళను అధిగమించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులనువారి విధులను సక్రమంగా నిర్వహించడం లోను, వారి పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడం లోను, వారి భాగస్వామ్యుల పాత్ర ఎనలేనిదన్నారు. ఉద్యోగ విరమణ తరువాత పోలీసు ఉద్యోగులు తమ సమయాన్ని ఆరోగ్యం పైనా, కుటుంబ సభ్యులతో గడిపేందుకు వెచ్చించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు అధికారులు తమ సర్వీసులో ఎదురైన అనుభవాలను, విలువైన సలహాలను పోలీసు శాఖకు అందించాలన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు అధికారులకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని, వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ భరోసా కల్పించారు. అనంతరం, ఉద్యోగ విరమణ చేసిన ఎస్సై ఎన్ని సత్యానందరావు దంపతులను, హెడ్ కానిస్టేబుల్ భాస్కరరావు దంపతులను పోలీసుశాఖ తరుపున ఎస్పీ వకుల్ జిందల్ సాలువా, పూల మాలలు, గిఫ్ట్, సన్మాన పత్రాలతో సత్కరించి, ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. అదే విధంగా జిల్లా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరుపున జిల్లా ఎస్పీ జ్ఞాపికలను, చెట్లను అందజేసారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు వారి సర్వీసులో సహకరించిన అధికారులకు, సిబ్బందికి తమ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుశాఖ తరుపున ఎస్పీ తమకు ఆత్మీయ వీడ్కోలు ను వలకడం, సన్మానించడం తమ జీవితంలో ఎన్నటికీ మరువలేమని జిల్లా ఎస్పీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే. చౌదరి, కంట్రోల్ రూం సిఐ వైకుంఠరావు, ఎస్ఐలు జగదీశ్వరరావు, శంకర్రావు, పోలీసు అసోసియేషను అడహాక్ సభ్యులు కే.శ్రీనివాసరావు, కోఆపరేటివ్ కార్యదర్శి నీలకంఠం నాయుడు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొని, ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.





# బాలిక హత్య కేసులో ముద్దాయికి ఉరిశిక్ష విధించిన చోడవరం కోర్టు

**- బాలిక మేనమామే కిరాతకుడు**

**- కుటుంబ కలహాలే కారణం**

**- రూ 20 ఇచ్చి మంచి చేసుకుని చంపేశాడు**

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 01:** బాలికను తన మేనమామ హత్య చేసిన కేసులో చోడవరం 9వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మంగళవారం సంచలనాత్మక తీర్పు చెప్పింది. 2015 డిసెంబర్ 23న దేవరాపల్లిలో 7 ఏళ్ల బాలిక హత్యకు గురికాగా పోలీసులు విచారణ జరిపి కోర్టుకు తరలించగా చోడవరంలో ఉన్న 9వ జిల్లా అదనపు సెషన్స్ కోర్టు ముద్దాయికి ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ఖమ్మం జిల్లాకు చెందిన వేపాడ ధనలక్ష్మి మురుగన్ దంపతులు దేవరాపల్లిలో హోటల్ పెట్టుకున్నారు. వారి వద్ద ధనలక్ష్మి తమ్ముడు సుబ్బాచారి గుణశేఖర్ పనిచేసేవాడు. అతను సరిగా పనిచేయకపోవడంతో ఆ దంపతులు అతన్ని పనిలోంచి తొలగించారు. దీంతో ఆ దంపతులపై కోపం పెంచుకున్న గుణశేఖర్ వారి పాప దేవరాపల్లిలో ఉన్న ఉషోదయ స్కూల్లో చదువుకుంటుండగా స్కూల్ నుండి వచ్చేటప్పుడు రూ 20 ఇచ్చి గారెలు కొనుక్కోమని చెప్పాడు. తర్వాత ఆ పాపను రైవాడ జలాశయం బిల్లుల మెట్టకొండ దగ్గరకు తీసుకువెళ్లి కాళీ బీర్ సీసాను కొట్టి గొంతుకు వద్ద కోసేసాడు. ఆ చిన్నారి రాలేదని ధనలక్ష్మి మురుగన్ దంపతులు వెతికి వెతికి చివరికి 24న దేవరాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోడవరం కోర్టులో ఎపిపి ఉగ్గిన వెంకట్రావు చాకచక్యంగా ప్రాసిక్యూషన్ చేసి సాక్షాలు రాబట్టడంతో 9వ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి రత్నకుమార్ ముద్దాయి సుబ్బాచారి గుణశేఖర్ కు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.



# పదవీ విరమణ పొందిన ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు కి ఘన వీడ్కోలు

**- మీ సేవలు చిరస్మరణీయం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా**

**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 01:** అనకాపల్లి ఎస్.బి డీఎస్పీ గా పదవీ విరమణ పొందిన సందర్భంగా బి.అప్పారావు, ఉషారాణి దంపతులకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఘనంగా సత్కరించారు. నేడు అనకాపల్లి పట్టణం లోని సన్ క్యాస్టల్ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో డీఎస్పీ కుటుంబ సభ్యులు, పోలీస్ శాఖ అధికారులు, స్నేహితులు, సహచరులు పాల్గొని ఆయన సేవలను ఘనంగా కొనియాడారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, మాట్లాడుతూ మీ అంకితభావం, పట్టుదల, నిబద్ధత, విధేయత పోలీస్ శాఖకు గొప్ప మార్గదర్శకం అని, మీరు సమర్థవంతంగా నిర్వహించిన విధులు మా అందరికీ ఆదర్శప్రాయంగా ఉంటాయి అన్నారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, కుటుంబంతో ఆనందంగా గడపాలని సూచించారు. పోలీస్ శాఖ నుంచి అవసరమైన అన్ని రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బి.అప్పారావు 34 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో సేవలందించి, అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన సమర్థత, నిబద్ధత, సేవాతత్పరత, నైపుణ్యాలను కొనియాడుతూ జిల్లా అదనపు ఎస్పీలు మాట్లాడుతూ, మీరు పోలీస్ శాఖ లక్ష్యాలను నెరవేర్చడంలో అత్యుత్తమ కృషి ప్రదర్శించారు. మీ సహాయ సహకారంతో పోలీస్ శాఖకు గొప్ప పేరు తెచ్చారు అని అన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన బి.అప్పారావు మాట్లాడుతూ ఈ విధంగా తనకు ఘనంగా వీడ్కోలు పలకడం, సత్కరించడం మా జీవితంలో మరుపురాని సంఘటన అన్నారు. పోలీస్ శాఖలో చేసిన సేవలను గుర్తుంచుకుని మా సేవలను స్మరించుకోవడం ఆనందదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ తో పాటు రిటైర్డ్ ఎస్పీ రవివర్మ, అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, మహిళా పోలీస్ డీఎస్పీ ఇ.శ్రీనివాసు, ఏవో ఏ.రామ కుమార్, సిఐలు లక్ష్మణ మూర్తి, బాల సూర్యారావు, లక్ష్మీ, జిల్లాలోని ఇతర సిఐలు, ఎస్ఐలు, పదవీ విరమణ పొందిన డీఎస్పీ కుటుంబ సభ్యులు మరియు పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.







# ఈనెల 5 వరకు చోడవరం సుగర్స్ క్రస్సింగ్

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 01:** చోడవరం చక్కెర కర్మాగారంలో ఈనెల 5 వరకు క్రస్సింగ్ కు జరుగుతుందని, చెరుకు ఉన్న రైతులు ఈలోగా కటింగ్ పర్మిట్లు తీసుకొని ఫ్యాక్టరీకి చెడుకు తీసుకురావాలని ఎండి వివిఎస్ నాయుడు తెలిపారు. రైతుల నుండి చెరుకు వచ్చేవరకు తీసుకుంటామని అయితే చెరుకు అందకపోవడం వలన ఇబ్బంది అవుతుందని పేర్కొన్నారు. కాగా, ఈ సీజన్ జనవరి 21 నుండి ప్రారంభం కాగా ఇప్పటివరకు 98 వేల టన్నులు చెరుకు గానుగ ఆడింది. మరొక 10 వేలు క్రస్సింగ్ జరిగే అవకాశం ఉందని అంటున్నారు.



# చోడవరంలో త్రాగునీటి సమస్య

**- అధికారులు పట్టించుకోలేదని ఆవేదన**

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 01:** నియోజకవర్గ కేంద్రం అయిన చోడవరంలో త్రాగునీటి సమస్య రావడంతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక తామరచెరువు వీధి, సకురు వీధి తదితర ప్రాంతాల్లో గత 3 నెలలు త్రాగునీరు రావడంలేదని ఆ ప్రాంతానికి చెందిన బిజెపి నాయకుడు పోతల శ్రీనివాసరావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు చెబుతున్నా కనీసం త్రాగునీరు కూడా సంతృప్తిగా ఇవ్వలేకపోతున్నారని పేర్కొన్నారు. బోర్లు ఉన్నా ఆ నీరు వంటలు చేయడానికి ఉపయోగపడటం లేదని, డబ్బులు ఉన్నవారు వాటర్ క్యాన్లు తెచ్చుకొని వినియోగిస్తున్నారని ఇలా ఎంత కాలం చేయగలమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు త్రాగునీరు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.



# చోడవరం నియోజకవర్గంలో 42150 మందికి పెన్షన్లు పంపిణీ

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 01:** నియోజవర్గంలోని చోడవరం, బుచ్చియ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో మంగళవారం వృద్ధాప్య, వితంతువులు, దివ్యాంగుల పెన్షన్లు 42150 మందికి పంపిణీ చేశారు. వారి వారి పథకాలను బట్టి పెన్షన్లు ఇవ్వగా రూ 56 కోట్ల 73 లక్షల 68 వేలు లబ్ధిదారులకు అందజేశారు. చోడవరం మండలంలో 12928 పెన్షన్లకు గాను 12485 మందికి అందజేయగా ఇంకా 443 మందికి ఇవ్వవలసి ఉంది. చోడవరం మండలంలో రూ 5 కోట్ల 21 లక్షల 63 వేలు లబ్ధిదారులకు అందజేశారు. బుచ్చియ్యపేట మండలంలో 10494 మంది లబ్ధిదారులకు గాను 9894 మందికి అందజేశారు. ఇంకా 600 మందికి ఇవ్వవలసి ఉంది. బుచ్చియ్యపేట మండలంలో రూ 4 కోట్ల 33 లక్షల 44 వేలు సొమ్ము అందజేశారు. అలాగే రావికమతం మండలంలో 11986 మంది పింఛన్ లబ్ధిదారులకు గాను 11343 మందికి అందజేయగా ఇంకా 643 మందికి ఇవ్వవలసి ఉంది. రావికమతం మండలంలోని లబ్ధిదారులకు రూ 4 కోట్ల 99 లక్షల 37 వేల 500 అందజేశారు. రోలుగుంట మండలంలో 8893 మంది లబ్ధిదారులు కాగా వారిలో 8428 మందికి ఇవ్వగా ఇంకా 465 మందికి ఇవ్వవలసి ఉంది. రోలుగుంట మండలంలోని పెన్షన్లు లబ్ధిదారులకు రూ 3 కోట్ల 52 లక్షల 24 వేలు అందజేశారు. ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజు చోడవరం మండలం గాంధీగ్రామంలో పెన్షన్ల పంపిణీ ప్రారంభించగా ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసులమ్మ, ఎంపీడీవో పి.వి.ఎన్.జే ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ బి.రవిబాబు, ఆ గ్రామ టిడిపి నాయకులు డికే శ్రీను, దాడి నాగ అప్పారావు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా లక్ష్మీ గణపతి హెూమం

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 01:** స్థానిక స్వయంభూ శ్రీవిఘ్నేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రీలక్ష్మీ గణపతి హెూమం ఘనంగా నిర్వహించారు. శుద్ధ చవితి సందర్భంగా శ్రీకార్యసిద్ధి గణపతిని ఉదయం విశేషంగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో కార్తీక్, గుంటూరు శ్రీను తదితరులు పాలాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ప్రత్యేక పూజలు జరిపి అనంతరం హెూమశాలలో శ్రీలక్ష్మీ గణపతి హెూమం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పసుమర్తి సాంబశివరావు, దేవాదాయ శాఖ ఈఓ ఎస్.వి.వి సత్యనారాయణ మూర్తి, శంకర్, శ్రీను రాజు భారీగా భక్తులు పాల్గొన్నారు.



# గోవాడలో కొత్త పింఛన్లు పంపిణీ

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 01:** మండలంలోని గోవాడ గ్రామంలో వితంతువులకు కొత్తగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భర్త చనిపోయిన వితంతువులకు నెల రోజుల్లో పింఛన్లు ఇవ్వాలని ఆదేశించడంతో ఆ గ్రామంలో సేనాపతి అచ్చియమ్మ, నందికోళ్ల పైడమ్మ అనే ఇద్దరికీ కొత్త పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ ఏడువాక లక్ష్మణ్ కుమార్, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామ అప్పారావు, ఏడువాక అర్జున్ మాస్టర్, ఏడువాక ఆనంద్, వేపాడ అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



# నా పై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు సర్పంచ్ చుక్క అనురాధ

**అచ్యుతాపురం పెన్ సత్తా ఏప్రిల్ 01:** మండలం లోని నునపర్తి పంచాయతీలో బిజెపి నాయకులు, గ్రామకంఠను ఆక్రమిస్తుంటే అడ్డుకున్నామని, టీడీపీ నాయకులు నాపై తప్పుడు ఫిర్యాదులను మంత్రులు లోకేష్, అనిత లకు ఇచ్చారని సర్పంచ్ చుక్క అనురాధ అన్నారు. ఈ సందర్భంగా అనురాధ పత్రికా ముఖంగా మాట్లాడుతూ ఇది ప్రగడ నాగేశ్వర రావు ప్రోత్సాహంతో నునపర్తికి చెందిన టిడిపి నాయకులు చేస్తున్నారని, నిజా నిజాలు నాగేశ్వర రావు తెలుసుకుంటే మంచిదని, మా అత్త సన్యాసమ్మ పేరున ఉన్న భూమిలో 20 సంవత్సరాలుగా సాగులో ఉంటే, మేము ఆక్రమిస్తున్నామని చెప్పడం సరికాదని నా వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి నేను ఆక్రమిస్తున్నానో లేక టిడిపి వాళ్ళ ఆక్రమిస్తున్నారో తెలుసుకోవాలని అన్నారు. రెడ్డి నాగేష్ డీ పట్టా భూమిని ఆక్రమిస్తున్నారని, వాళ్లు ఏ పార్టీ నుంచి టిడిపిలో చేరారో గుర్తు చేసుకోవాలని, అలాగే ప్రముఖ తెలుగు దినపత్రికి చెందిన స్థానిక రిపోర్టర్ కు వాస్తవాలు పరిశీలించి వార్తలు రాయండి అని ఎన్నిసార్లు చెప్పినా నేను ఎవరి మాట వినను అన్న ధోరణిలో నన్ను టార్గెట్ చేస్తూ వార్తలు రాయడం సరికాదని, ఈ విషయమై పై స్థాయి అధికారులకు, నాయకులకు ఫిర్యాదు చేస్తానని, నా పై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని సర్పంచ్ చుక్క అనురాధ పత్రికా సమావేశంలో మాట్లాడారు.



# ధర్మవరం రైల్వే స్టేషన్ ఆధునికరణకు మరింత చర్యలు చేపడతాం

**- గుంతకల్ రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ విల్సన్ బాబు**

**ధర్మవరం, పెన్ సత్తా ఏప్రిల్ 01:** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం రైల్వే స్టేషన్ ఆధునీకరణకు మరిన్ని చర్యలు చేపడతామని గుంతకల్ రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ విల్సన్ బాబులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ధర్మవరం రైల్వే స్టేషన్ స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ,రైల్వే నిర్మాణ పనులను ప్లాట్ఫారము, విశ్రాంతి గది, బుకింగ్ కౌంటర్, తదితర వాటిని కూడా పరిశీలించడం జరిగిందని తెలిపారు. అనంతరం ప్లాట్ఫారం వద్ద డ్రైనేజ్ నీరు బయటకు వస్తున్నాడంతో ప్రయాణికులు దుర్వాసన భరించలేకపోతున్నారని రైల్వే డివిజన్ కమిటీ సభ్యులు భీమనేని ప్రసాద్ నాయుడు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. స్పందించిన అధికారులు ధర్మవరం రైల్వే స్టేషన్ లో అన్ని సమస్యలను తప్పక పరిష్కరిస్తామని వారు స్పష్టం చేశారు. ధర్మవరం రైల్వే స్టేషన్ ఆధునికరణ కోసం 7.50 కోట్లకు గాను పేస్-1 కింద రూ. 3.50 కోట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రైల్వే స్టేషన్ లో జి ఆర్ పి ఆర్ పి ఎఫ్ భవనాలు చాలా పాతవి కావడంతో వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించడానికి నిధులు కూడా మంజూరు కావడం జరిగిందని తెలిపారు. త్వరలోనే టెండర్లను పిలిచి నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. రైల్వే ఆసుపత్రి నిర్మించడానికి విశేష కృషి చేస్తున్నామని, విశ్రాంతి గదిలో,ప్రతి ప్లాట్ఫారం వద్ద గల మరుగుదొడ్లు ఏర్పాటు చేయడానికి కూడా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా రైల్వేటేషన్ నుంచి పుట్టపర్తి వెళ్లడానికి మరిన్ని బస్సులను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గుడ్ సెట్ కొట్టాల వైపు నుంచి వచ్చే ప్రయాణికుల కోసం బుకింగ్ కౌంటర్ ను ఏర్పాటు చేయడం కూడా జరుగుతుందని తెలిపారు. కొన్ని సంవత్సరాల కిందట గల కట్టడాలను మొత్తం తొలగించడం జరుగుతుందని 2.5 లక్షల రూపాయలతో కెపాసిటీ ట్యాంకులు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదేవిధంగా ప్రయాణికుల సౌకర్యం కేంద్రం అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ చల్లా నరసింహానాయుడు,కమర్షియల్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, సీనియర్ సెక్షన్ సివిల్ ఇంజనీర్ ఉమేష్ కుమార్, కమర్షియల్ ఇన్స్పెక్టర్ బాబూజీ రావు,ధర్మవరం స్టేషన్ వినియోగదారుల సలహా కమిటీ సభ్యుడు కాశీ విశ్వనాథ్, వంకదారి నాగరాజు,కోటి వెంకటేశులు, భీమనేని ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# సజావుగా జరిగిన పెన్షన్ పంపిణీ కార్యక్రమం 94 శాతం పెన్షన్ పంపిణీ

**- మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్**

**ధర్మవరం, పెన్ సత్తా ఏప్రిల్ 01:** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలో ప్రభుత్వ,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెన్షన్ పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగిందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు పెన్షన్ కేంద్రాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కొన్ని కేంద్రాల వద్ద కమిషనరే స్వయంగా పెన్షన్ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, పట్టణంలోని 40 వార్డులలో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పెన్షన్ సచివాలయ సిబ్బంది ఇంటింటా వెళ్లి పంపిణీ చేయడం జరిగిందన్నారు. పట్టణంలోని 40 వార్డులలో 18,032 మంది పెన్షన్ దారులకు 7 కోట్ల 84 లక్షల 63 వేల 500 రూపాయలను సకాలంలో పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీన 94 శాతం పెన్షన్లను మా సచివాలయ258 మంది ఉద్యోగులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పెన్షన్ పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈనెల మూడవ తేదీ లోపు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్ఓ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.




# ఆదివాసీలకు అండగా ఉంటాం.... జనసేన రాజు

**- దౌర్జన్యం చేస్తే ఆందోళన చేస్తాం....**

**- ఎస్పికి ఫిర్యాదు**

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 01:** ఆదివాసీల భూములు ఆక్రమించడానికి కొందరు వారిపై దౌర్జన్యం చేస్తున్నారని, భూమిని సాగు చేసుకుని జీవిస్తున్న పేదలపై ప్రతాపం చూపించడం పద్ధతి కాదని భవిష్యత్తులో ఇటువంటి జరుగుతే వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి పి.వి.ఎస్.ఎన్ రాజు తెలిపారు. దీనిపై జిల్లా ఎస్పీ ని కలిసి ఫిర్యాదు చేసామని జనసేన రాజు పేర్కొన్నారు. రోలుగుంట మండలం, ఎంకె పట్నం పంచాయతీలో గల చటర్జీపురం గ్రామంలో దశాబ్దాలు తరబడి ఆదివాసీలు నివసిస్తున్నారని, వారు సాగు చేసుకుంటున్న భూమిని ఆక్రమించుకోవడానికి కొందరు అక్కడ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కొయ్యూరు మండలం నకు చెందిన వారాడ నూకరాజు పలుమార్లు ఆదివాసీలపై దౌర్జన్యం చేయడం కొట్టడం చేస్తున్నారని పోలీసులు విచారణ జరిపి అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరామని పేర్కొన్నారు. దీనిపై జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడారని తెలిపారు.





# పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో దొడ్డి

**మునగపాక పెన్ సత్తా ఏప్రియల్ 01:** మండలం లోని నాగులపల్లి గ్రామంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మునగపాక మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు. మంగళవారం ఈ కార్యక్రమంలో పాల్గొని పింఛను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఇంటికి వెళ్లి వృద్ధులకు 4,000 రూపాయలు పెన్షన్ ఇవ్వడం ద్వారా ప్రభుత్వ చిత్తశుద్ధి నిరూపించుకుందన్నారు. అభివృద్ధికి చంద్రబాబు నాయుడు బ్రాండ్ అంబాసిడర్ అని ప్రపంచ వ్యాప్తంగా తెలుసన్నారు. చంద్రబాబు నాయుడు సంపద సృష్టించి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం చేస్తారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పలు సందర్భాల్లో అన్నారంటే ముఖ్యమంత్రి గొప్పతనం మనం అర్థం చేసుకోవాలి అన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థని పూర్తిగా దెబ్బతీసింది, ఎటువంటి అభివృద్ధి కి నోచుకోని రాష్ట్రం లాగా మిగిలిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక కష్టకాలంలో కూడ మారుమూల పల్లెలో రోడ్లు వేయడం, నిన్న అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు నాలుగు రోడ్ల వెడల్పు రోడ్డుకి మంత్రి లోకేష్ శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. పంచాయతీ వ్యవస్థను ప్రతిష్టం చేయడం, ఎన్డీఏ ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తుందన్నారు. యువ నాయకులు నారా లోకేష్ ప్రస్తుతం విద్యా శాఖలో పెను మార్పులు చేస్తూ పాఠశాలలో, హైస్కూల్లో, మౌలిక వసతులు రూపకల్ప, చక్కని విద్య అందించే దిశగా, నిరుద్యోగ యువతకు ఉద్యోగులు అవకాశాలు కల్పించే దిశగా కూటమిని నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోసాల గోవింద్, నీటి సంఘం అధ్యక్షులు, దొడ్డి వీర వెంకటరావు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు పలమరశెట్టి నాగు, మల్ల అప్పల నాయుడు, ఆడారి నాయుడు, అడపా నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# పాపిరెడ్డిపల్లి హత్య కేసును చేదించిన పోలీసులు, ఇద్దరు నిందితులు అరెస్టు

## - డిఎస్పి హేమంత్ కుమార్

**ధర్మవరం, పెన్ సత్తా ఏప్రిల్ 01:** ధర్మవరం డివిజన్ పరిధి లోని రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామంలో మార్చి 30 వ తేదీ జరిగిన ఘర్షణలో మజ్జిగ లింగప్ప మృతి చెందిన కేసును రామగిరి పోలీసులు ఒక్క రోజులోనే చేదించారు. ఈ సందర్భంగా డిఎస్పి హేమంత్ కుమార్ ధర్మవరం పట్టణం లోని డిఎస్పీ కార్యాలయంలో హత్య కేసు చేదించిన వివరాలను వారు వెల్లడించారు. అనంతరం డిఎస్పీ మాట్లాడుతూ, మార్చి 30 వ తేదీన జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన మజ్జిగ లింగన్న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగిందని తెలిపారు. ఫిర్యాదు దారుని కుమారుడు మనోహర్, తన అత్త ఇంటికి వెళుతుండగా నిందితులు ఆదర్శ్ అతని అనుచరులు అతడిని అభ్యంతరంగా హేళన చేయడం జరిగిందని, ఈ విషయం ఫిర్యాదు దారునికి మొబైల్ ద్వారా తెలియడంతో ఆమె భర్త మజ్జిగ లింగన్న (వయసు 55 సంవత్సరాలు తండ్రి లేట్ మల్లప్ప) నిందితులను తన ఇంటి ముందు కూర్చొని ప్రశ్నించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఆదర్శ్, నాయుడు వారి ఇంటికి వచ్చి మజ్జిగ లింగన్నను కట్టెలతో తల పై తీవ్రంగా కొట్టడం జరిగిందన్నారు. ఫలితంగా అతనికి తీవ్ర రక్త గాయాలు కావడం జరిగిందన్నారు. గాయపడిన మజ్జిగ లింగన్నను హుటా హుటిన అనంతపురం లోని కిమ్స్ ఆసుపత్రిలో తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించడం జరిగిందని తెలిపారు. ఈ ఘటన పై మృతుని భార్య ఫిర్యాదు మేరకు రామగిరి ఎస్సై మర్డర్ కేసుగా నమోదు చేసి దర్యాప్తును చేయడం జరిగిందన్నారు. ఈ హత్య కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు రామగిరి ఎస్సై శ్రీధర్ నేతృత్వంలో డిఎస్పి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బృందాలు శ్రమించి నిందితులను గుర్తించి అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. అరెస్టు అయిన వారిలో ధర్మవరపు ఆదర్శ్ రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామం, ధర్మవరపు మనోజ్ రామగిరి మండలం పాపిరెడ్డి గ్రామం అని తెలిపారు. ఈ నిందితులను మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో రామగిరి గ్రామ శివారులోని కరెంట్ ఆఫీస్ వద్ద అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కేసును విజయవంతంగా సాధించడంలో కీలకంగా వ్యవహరించిన రామగిరి సీఐ శ్రీధర్ నీ వారి పోలీస్ సిబ్బందిని ధర్మవరం డిఎస్పి హేమంత్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ విభాగం న్యాయంగా నిష్పక్షపాతంగా పనిచేసే నిందితులను అరెస్టు చేయడంలో నిరంతరం కృషి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగిరి సీఐ శ్రీధర్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.




# నూకాలమ్మను దర్శించుకున్న పిఎస్ గిరీషా

**అనకాపల్లి పెన్ సత్తా ఏప్రిల్ 01:** ఆంధ్రప్రదేశ్ క్రీడా శాఖ వైస్ చైర్మన్ ఎండి పిఎస్ గిరీషా అనకాపల్లి నూకాలమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం చైర్మన్ పీలా నాగ శ్రీను, ఈవో రాంబాబు ఆయనకు ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనానంతరం అర్చకులచే ఆశీర్వచనం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిసెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.





# ఎన్టీపీసీ కాలుష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పిర్యాదు

**పరవాడ పెన్ సత్తా ఏప్రిల్ 01:** మండలం లోని రావాడ గ్రామపంచాయతీ శివారు సోమినాయుడు పాలెం గ్రామం ఎన్టీపీసీ కాలుష్యం వల్ల ప్రజలందరూ నివాసం ఉండలేక పోతున్నారని కలెక్టర్ కి పిర్యాదు చేశారు. ఈ ఎన్టీపీసీ వల్ల గ్రౌండ్ లెవెల్ వాటర్ పాడైపోయిందని, త్రాగడానికి నీరు లేదని, నిర్మించుకున్న ఇల్లు పెచ్చులు రాలి పోతున్నాయి, వ్యవసాయం మొత్తం పాడై పోతుంది. ఈ కాలుష్యం వల్ల ప్రజలందరూ ఆరోగ్యం పాడైపోతుంది చర్మ వ్యాధులు ఎక్కువ వ్యాపిస్తున్నాయి. దయచేసి సోమినాయుడుపాలెం గ్రామాన్ని సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని వియ్యపు చిన్నా (మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు )గ్రామస్తులు కలిసి వినతిపత్రం కలెక్టర్ కి ఇచ్చి కోరడమైనది.



# సాగునీటి ఇబ్బందుల నివారణకు చర్యలు

**ఆత్రేయపురం పెన్ సత్తా :** లొల్ల లాకులను రూ.72 కోట్లతో పునర్నిర్మించేందుకు కృషి చేస్తానని ఎంఎల్ఏ బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం ఆయన లొల్ల లాకుల వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూటరీ, సాగునీటి సంఘాల సమావేశం సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి లేని మన జిల్లా వాసులంతా వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నామని చెప్పారు. సాగునీటి పై ఆధారపడి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవడం ప్రధానమైన లొల్ల లాకుల ఆధునీకరణ కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సంబంధిత శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును ప్రత్యేకంగా కోరినట్టు తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు కూడా ఇందుకు పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పారు. తద్వారా వ్యవసాయం అభివృద్ధి చెందితే రైతులు బాగుపడతారని, రైతాంగం పై ఆధార పడిన అన్ని వర్గాల వారికీ మేలు జరుగుతుందని తెలిపారు. మరో ప్రక్కన టూరిజంకు అనువుగా ఉన్న ప్రాంతాలు మన కోనసీమలో చాలా ఉన్నాయని, ఎకో టూరిజం అభివద్ధి చేయాలని కోరినట్టు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి నీటి సంఘాల కమిటీల చైర్మెన్లు కృషి చేయాలని ఎంఎల్ఏ సత్యానందరావు సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్, గోదావరి సెంట్రల్ డెల్టా చైర్మెన్ గుబ్బల శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, కెవి.సత్యనారాయణ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



# లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ రాట

**అనకాపల్లి పెన్ సత్తా ఏప్రిల్ 01:** గవరపాలెం వెలసియున్న లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 8 వ తారీకున జరగబోయే స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవం యొక్క రాట ముహూర్తం కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీ నరసింహ స్వామి తిరు కళ్యాణం, ఈ నెల 8 వ తారీకున, 30 వ తారీఖున స్వామివారి చందనోత్సవం అత్యంత, వైభవంగా జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహకులు మళ్ళ రామచంద్ర రావు దాడి రత్నాకర్ కి తెలియజేశారు. అనంతరం స్వామివారి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మళ్ళ రామచంద్ర రావు,పద్మావతి దంపతులని అభినందించారు.





# మయన్మార్ భూకంప మృతులు 2056

మాండలే : పలు మృత దేహాలను శిధిలాల నుండి వెలికితీయడంతో ఇప్పటివరకు మయన్మార్ భూకంప మృతుల సంఖ్య 2056కి చేరిందని ఆ దేశ సైనిక ప్రభుత్వం ప్రకటించింది. ఇక శిధిలాల్లో చిక్కుకున్నవారు జీవించి వుండే అవకాశాలు లేవని భావిస్తున్నారు. 270మందికి పైగా గల్లంతయ్యారని, 3,900 మంది వరకు గాయపడ్డారని ప్రభుత్వ ప్రతినిధి మేజర్ జనరల్ జా మిన్ మీడియాకు తెలిపారు. దేశాన్ని అతలాకుతలం చేసిన భూకంపం భారీ నష్టాన్ని కలిగించిన నేపథ్యంలో వారం రోజులు సంతాప దినాలను మయన్మార్ సోమవారం ప్రకటించింది. ఏప్రిల్ 6వ తేదీ వరకు జాతీయ పతాకాలను అవనతం చేస్తారని జుంటా ఒక ప్రకటనలో తెలిపింది. పరిస్థితులు చాలా దయనీయంగా వున్నాయని మాండలేలోని ఒక మసీదు చీఫ్ అడ్మినిస్ట్రేటర్ వ్యాఖ్యానించారు. ప్రకంపనలు కొనసాగుతుండడంతో ప్రజలు వరుసగా మూడో రోజూ వీధుల్లోనే మకాం వేశారు. బ్యాంకాక్‌లో మృతుల సంఖ్య 19కి పెరిగింది. మయన్మార్‌లో కమ్యూనికేషన్ వ్యవస్థ చాలా వరకు తెగిపోవడంతో పూర్తి సమాచారం అందడం లేదని భావిస్తున్నారు. వెయ్యి పడకల ఆస్పత్రి కూలిపోవడంతో వెలుపలనే ఆస్పత్రిని ఏర్పాటు చేసి వందలాదిమంది రోగులకు చికిత్సనందిస్తున్నారు.

# టైగర్ ట్రయంఫ్ నావికా విన్యాసాలు ప్రారంభం

విశాఖపట్నం పెన్ సత్తా : ఇండియా - యుఎస్ దేశాల మధ్య ద్వైపాక్షిక ట్రై-సర్వీస్ హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్ (హెచ్ఎడిఆర్) విన్యాసాలు (టైగర్ ట్రయంఫ్ నాలుగో ఎడిషన్) మంగళవారం ఉదయం విశాఖ నావెల్ డాక్‌యార్డ్ లోని ఐఎన్ఎస్ జలాశ్వ పై లాంఛనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ఈ నెల 7 వ తేదీ వరకూ హార్బర్ ఫేజ్ విన్యాసాలను విశాఖపట్నం లోనూ, ఎనిమిది నుంచి 13 వరకూ సి ఫేజ్ విన్యాసాలను బంగాళాఖాతం లోనూ నిర్వహించనున్నారు. ప్రారంభ వేడుకల్లో భాగంగా ఐఎన్ఎస్ జలాశ్వలో సంయుక్త ఫ్లాగ్ పరేడ్ నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన భారత్ లోని అమెరికా తాత్కాలిక రాయబారి జోర్గాన్ ఆండ్రూస్ మాట్లాడుతూ ఇండో పసిఫిక్ రీజియన్ లోని ప్రజల భద్రతను కాపాడేందుకు ఈ విన్యాసాలు దోహదపడతాయన్నారు. భారత్ తో కలిసి భాగస్వామ్యం కావడం తమకు సంతోషంగా ఉందన్నారు. రానున్న కాలంలో ఇరుదేశాల మధ్య మరింత సోదర భావం పెరుగుతుందని తెలిపారు. తూర్పు నావికాదళ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా మాట్లాడుతూ ఈ విన్యాసాలు ఇరుదేశాల మధ్య సైనిక సహకార విషయంలో మాత్రమే జరగడం లేదని, ప్రజాస్వామ్య, లౌకిక, బహుళ భాగస్వామ్య విలువల వేడుకగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. సంక్షోభ సమయాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో అమెరికా కాన్సల్ జనరల్ జెనీఫర్ లారెన్, రియర్ అడ్మిరల్ న్యూక్రిక్, యుఎస్ఎస్ నేవీ కమాండింగ్ ఆఫీసర్ బైరాన్ స్టాక్స్, ఇండియన్ నేవీ ఫ్లీట్ కమాండర్, ఈస్టర్న్ ఫ్లీట్ రియర్ అడ్మిరల్ సుశీల్ మీనన్, ఐఎన్ఎస్ జలాశ్వ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ నౌషాద్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు. విన్యాసాలలో భారత నావికాదళానికి చెందిన జలాశ్వ, ఘరియాల్, ముంబయి, శక్తి నౌకలు, లాంగ్ రేంజ్ మారిటైమ్ పెట్రోలింగ్ ఎయిర్ క్రాఫ్ట్ పి8ఐ, 91 ఇన్ఫ్‌బ్రిగేడ్, 12 మెచ్ ఇన్ఫాంట్రీ బెటాలియన్‌కు చెందిన ఆర్మీ దళాలు, ఎయిర్‌ఫోర్స్ సి - 130 ఎయిర్‌క్రాఫ్ట్, ఎంఐ-17 హెలికాప్టర్లతో పాటు ర్యాపిడ్ యాక్షన్ మెడికల్ టీమ్ (ఆర్ఎఎంటి) భారత తరుపున ప్రాతినిధ్యం వహించనున్నాయి. అమెరికా తరఫున యుఎస్ నేవీ షిప్స్ కామ్ స్టాక్, రాల్ఫ్ జాన్సన్‌లతో పాటు యుఎస్ మెరైన్ డివి దళాలు పాల్గొననున్నాయి.



# భారత్, చైనా దౌత్య బంధానికి 75 ఏళ్ళు

**- పరస్పర విశ్వాసంతో ముందుకు సాగాలన్న ద్రౌపది ముర్ము**

**- కలిసి పనిచేసేందుకు సిద్ధమన్న జిన్‌పింగ్**



న్యూ ఢిల్లీ పెన్ సత్తా : భారత్, చైనా మధ్య దౌత్య బంధానికి 75 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, చైనా అధ్యక్షులు జిన్‌పింగ్ మంగళవారం అభినందన సందేశాలు పరస్పరం పంపుకున్నారు. భారత్, చైనా రెండూ ప్రాచీన నాగరికతలు కలిగిన దేశాలని, ప్రధాన వర్ధమాన దేశాలని, గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన సభ్య దేశాలని ఇరువురు నేతలు పేర్కొన్నారు. ఈ రెండు దేశాలు వాటి ఆధునీకరణ ప్రయత్నాల్లో కీలకమైన దశలో వున్నాయని వ్యాఖ్యానించారు. ప్రపంచ జనాభాల్లో మూడో వంతు జనాభా భారత్, చైనాల్లోనే వున్నారని రాష్ట్రపతి ముర్ము అన్నారు. సుస్థిరమైన, విశ్వసనీయమైన, స్నేహంతో కూడిన ద్వైపాక్షిక సంబంధాలు ఇరు దేశాలకే కాకుండా యావత్ ప్రపంచానికి లబ్ది చేకూరుస్తాయని ఆమె తెలిపారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత స్థిరంగా ముందుకు తీసుకెళ్ళడానికి కలిసి కృషి చేయాలని అందుకు ఈ 75ఏళ్ళ వార్షికోత్సవాన్ని ఒక అవకాశంగా తీసుకోవాలని ముర్ము కోరారు. పరస్పర లక్ష్య సాధనల్లో భాగస్వాములుగా వుండేందుకు, డ్రాగన్-ఏనుగు బంధాన్ని సాకారం చేయడానికి చైనా, భారత్‌లకు ఇది సరైన ఎంపిక అని ఇరు దేశాల మధ్య సంబంధాల అభివృద్ధితో స్పష్టమవుతోందని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. శాంతియుత సహజీవనం, పరస్పర విశ్వాసం, పరస్పర ప్రయోజనాలు, ఉమ్మడి అభివృద్ధితో కూడిన పంథాను అనుసరించాల్సి వుందన్నారు. బహుళ ధృవ ప్రపంచాన్ని, అంతర్జాతీయ సంబంధాల్లో మరింత ప్రజాస్వామ్యాన్ని పెంపొందించాలని కోరారు. ఈ దిశగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా వున్నామని జిన్‌పింగ్ చెప్పారు. చైనా-భారత్ సరిహద్దు ప్రాంతాల్లో శాంతి భద్రతలను ఉమ్మడిగా పరిరక్షించాలన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా ప్రధాని లీ కియాంగ్ కూడా పరస్పరం అభినందన సందేశాలు పంపుకున్నారు. మానవ చరిత్ర గమనానికి ఒక రూపునివ్వడంలో ఇరు దేశాలు కీలక పాత్ర పోషించాయని మోదీ పేర్కొన్నారు. శాంతి, అభివృద్ధి కూడా పెంపొందించే బృహత్తర బాధ్యతలను భుజానకెత్తుకోవాల్సి వుందన్నారు. ఇరు దేశాల ప్రజలకు మరింత ఉపయోగపడేలా ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్ళాలని కియాంగ్ కోరారు.

# తొలిసారిగా వందేభారత్ రైలు..

**- 38 సొరంగాలు.. 927 వంతెనలు దాటుకుంటూ..**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏప్రిల్ 19న కాత్రా నుండి కాశ్మీర్‌కు మొదటి వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నారు. దీనితో 272 కి.మీ. పొడవైన ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింక్ ప్రాజెక్ట్ పూర్తవుతుంది. జమ్మూ రైల్వే స్టేషన్‌లో మరమ్మత్తు, పునరుద్ధరణ పనులు జరుగుతున్నందున జమ్మూ-కాత్రా-శ్రీనగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ మొదట కాత్రా నుండి నడుస్తుంది. రైలు లింక్ ప్రాజెక్ట్ గత నెలలో పూర్తయిందని అధికారులు తెలిపారు. జనవరిలో కాత్రా- కాశ్మీర్ మధ్య రైలు సేవను రైల్వే భద్రతా కమిషనర్ ఆమోదించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ జమ్మూ అండ్ శ్రీనగర్ మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని, ఈ ప్రాంతానికి ఆధునిక, సమర్థవంతమైన రైలు సేవలను అందిస్తుందని అధికారులు చెబుతున్నారు. దీని గురించి కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏప్రిల్ 19న ఉధంపూర్ చేరుకుంటారు. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెనను ఆయన సందర్శించి ప్రారంభిస్తారు. దీని తర్వాత ఆయన కాత్రా నుండి వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తారని అన్నారు. దీనితో కాశ్మీర్‌కు ప్రత్యక్ష రైలు కనెక్టివిటీ కోసం చాలా కాలంగా ఉన్న డిమాండ్ నెరవేరుతుంది. ప్రస్తుతం లోయలోని సంగల్దాన్, బారాముల్లా మధ్య, అలాగే కాత్రా నుండి దేశవ్యాప్తంగా ఉన్న గమ్యస్థానాలకు మాత్రమే రైలు సేవలు నడుస్తున్నాయని తెలిపారు. కాశ్మీర్‌ను రైలు ద్వారా అనుసంధానించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు 1997లో ప్రారంభమైందని అధికారులు తెలిపారు. కానీ భౌగోళిక, భౌగోళిక, వాతావరణ సంబంధిత సవాళ్ల కారణంగా దీని పూర్తి ఆలస్యం అయింది. ఈ ప్రాజెక్టులో మొత్తం 119 కి.మీల పొడువునా 38 సొరంగాలు ఉండగా, వీటిలో 12.75 కి.మీల మేర నిర్మించిన టీ-49 సొరంగం అత్యంత పొడవైనది. అలాగే, ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో 927 వంతెనలు సైతం ఉన్నాయి. వీటిలో చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన కూడా ఉంది. దీని ఎత్తు 359 మీటర్లు కాగా, పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 35 మీటర్లు ఎక్కువ.



# కొత్త ఆర్థిక సంవత్సరం నష్టాలతో స్టాక్ మార్కెట్లు ప్రారంభం

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కొత్త ఆర్థిక సంవత్సరాన్ని భారీ నష్టాలతో ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు సూచీల సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగా సూచీలు ఒత్తిడికి గురవుతున్నాయి. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 450 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 23,400 మార్క్ వద్ద ఊగిసలాడుతోంది. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 374 పాయింట్ల నష్టంతో 77,035 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 85 పాయింట్ల నష్టంతో 23,433 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎంఅండ్ఎం, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, నెస్లే ఇండియా షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 74.93 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 3,174 డాలర్ల మార్క్‌ను దాటింది. అమెరికా మార్కెట్లు సోమవారం మిశ్రమంగా ముగిశాయి. ఎస్ అండ్ పీ సూచీ 0.55 శాతం, డౌజోన్స్ 1 శాతం మేర లాభపడ్డాయి. నాస్‌డాక్ మాత్రం ఫ్లాట్‌గా ముగిసింది. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఆస్ట్రేలియా ఎఎస్ఎక్స్ సూచీ 0.63 శాతం, జపాన్ నిక్కీ 0.58 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 1.05 శాతం, షాంఘై 0.48 శాతం లాభంతో కదలాడుతున్నాయి.



# వాహనాల మాయాజాలం.. తగ్గిన పెట్రోల్, డీజిల్ డిమాండ్!

ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై సబ్సిడీ ఇవ్వడం, ఆదాయపు పన్నులో మినహాయింపు ఇవ్వడం వెనుక ఉన్న ప్రభుత్వ ఉద్దేశ్యం దాని ప్రభావం ఇప్పుడు నిజంగా కనిపిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు పెరగడం వల్ల దేశంలో పెట్రోల్, డీజిల్ డిమాండ్ పై ప్రభావం చూపడం ప్రారంభమైంది. ఎస్‌బీఐ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం.. దేశంలో పెట్రోల్, డీజిల్ వినియోగం గణనీయంగా తగ్గింది. ఫిబ్రవరి 2025లో పెట్రోల్ వినియోగం 12 నెలల కనిష్ట స్థాయికి, అలాగే డీజిల్ వినియోగం 5 నెలల కనిష్ట స్థాయికి చేరుకుంది. నివేదిక ప్రకారం.. ఫిబ్రవరి 2025లో దేశంలో 31 లక్షల టన్నుల పెట్రోల్ వినియోగించగా, డీజిల్ వినియోగం 71 లక్షల టన్నులు. జనవరి 2025 డేటాతో పోలిస్తే ఫిబ్రవరిలో పెట్రోల్ వినియోగం 5.4 శాతం తగ్గింది. అదే సమయంలో డీజిల్ వినియోగం 5.1 శాతం తగ్గింది. అయితే గత ఏడాది ఫిబ్రవరి గణాంకాలతో పోలిస్తే, పెట్రోల్ వినియోగం 3.5 శాతం పెరగగా, డీజిల్ వినియోగం 1.2 శాతం తగ్గింది. దేశంలో సీఎన్‌జీ, హైబ్రిడ్, ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు పెరగడం వల్ల పెట్రోల్ డిమాండ్ తగ్గడానికి ప్రధాన కారణం. 2024 సంవత్సరంలో దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలలో 27 శాతం వృద్ధి కనిపించింది. డీజిల్‌ను ప్రధానంగా రవాణా అవసరాలకు ఉపయోగిస్తారు. ఈ రంగంలో తక్కువ మోటారు వాహనాల (%వీఎ%) విభాగంలో పెద్ద సంఖ్యలో ప్రజలు విద్యుత్ వైపు మళ్లారు. దీనివల్ల డీజిల్ డిమాండ్ తగ్గింది. అదే సమయంలో ట్రక్, బస్సు విభాగంలో సీఎన్‌జీ, ఎన్ఎన్‌జీ మొదలైన విద్యుత్, ప్రత్యామ్నాయ ఇంధనాల వాడకం పెరుగుతోంది. అదే సమయంలో రైల్వేల డీజిల్ వినియోగం కూడా తగ్గింది. భారతదేశం ఇప్పటికీ ప్రతి సంవత్సరం తన పెట్రోలియం అవసరాలలో ఎక్కువ భాగాన్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి అంటున్నారు. పెట్రోలియం కోసం దిగుమతులపై మన ఆధారపడటం 87 శాతానికి పైగా పెరిగింది.




# రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న గోల్డ్..

గత కొన్ని సంవత్సరాలుగా బంగారం ధరలు స్థిరంగా ఉండటం లేదు. 2014 చివరి త్రైమాసికంలో బంగారం ధరలు తగ్గడంతో ఒక్కసారిగా భారీ డిమాండ్ ఏర్పడింది. నగరంలో 18 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాము రూ. 6,895లుగా ఉంది. బంగారంతో పాటు వెండికి సైతం డిమాండ్ భారీగానే పెరిగింది. ప్రస్తుతం గోల్డ్ ఒక సురక్షితమైన పెట్టుబడి సాధనంగా మారిపోయింది. దీంతో పసిడి ధరలు చుక్కలనంటుతున్నాయి. రోజు రోజుకూ బంగారం ధరలు ఏమాత్రం తగ్గకుండా దూసుకెళ్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా బంగారం ధరలు స్థిరంగా ఉండటం లేదు. 2014 చివరి త్రైమాసికంలో బంగారం ధరలు తగ్గడంతో ఒక్కసారిగా భారీ డిమాండ్ ఏర్పడింది. ఈరోజు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాముకు రూ.9,192 ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాము రూ. 8,426లుగా ఉంది. అలాగే, 18 క్యారెట్ల బంగారం ధర 1 గ్రాము రూ. 6,895లుగా ఉంది. బంగారంతో పాటు వెండికి సైతం డిమాండ్ భారీగానే పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోండి.. బంగారం ధరలు. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.84,260, 24 క్యారెట్ల ధర రూ.91,920 గా ఉంది.విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.84,260, 24 క్యారెట్ల ధర రూ.91,920గా ఉంది. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.84,410, 24 క్యారెట్ల ధర రూ.92,070 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.84,260, 24 క్యారెట్ల ధర రూ.91.920 గా ఉంది.చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.83,410, 24 క్యారెట్ల రేటు రూ.90,990 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.84,260, 24 క్యారెట్ల ధర రూ.91,920 గా ఉంది.



# ఘన విజయం సాధించిన ముంబై ఇండియన్స్!



ముంబై ఇండియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్‌ను 8 వికెట్ల తేడాతో ఓడించింది. వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ జట్టు మొదట బ్యాటింగ్ చేస్తూ కేవలం 116 పరుగులకే ఆలౌట్ అయింది. దీనికి బదులుగా ముంబై 13వ ఓవర్‌లోనే ఈ లక్ష్యాన్ని సాధించి ఖూూ 2025లో తమ తొలి విజయాన్ని నమోదు చేసింది. వరుసగా రెండు ఓటములు చవిచూసిన తర్వాత ముంబైకి ప్రస్తుత సీజన్‌లో తొలి విజయం దక్కింది. ఈ పోరులో రికెల్టన్, అశ్వనీ కుమార్ వీ× విజయానికి హీరోలుగా నిలిచారు. ముంబై ఇండియన్స్ ఖూూ 2025లో వరుసగా 2 ఓటములు చవిచూసిన తర్వాత తమ తొలి విజయాన్ని సాధించింది. కోల్‌కతా నైట్ రైడర్స్ వీ× ముందు 117 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. రోహిత్ శర్మ, రికెల్టన్ ముంబైకి వేగవంతమైన ఆరంభాన్ని అందించినప్పటికీ రోహిత్ శర్మ యొక్క ఫామ్‌లో లోపం కొనసాగుతోంది. రోహిత్ కేవలం 13 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. విల్ జాక్స్ ఈ మ్యాచ్‌లో తిరిగి రాగా అతను కూడా పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. జాక్స్ కేవలం 16 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. ముంబై ఇండియన్స్ వాంఖడే స్టేడియంలో జట్టుగా ప్రదర్శన చేసింది. మొదట అశ్వనీ కుమార్ బౌలింగ్‌లో మెరిశాడు. అతను తన డెబ్యూ మ్యాచ్ ఇదే కావడం విశేషం. 3 ఓవర్లలో 24 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు. దీపక్ చాహర్ కూడా 2 వికెట్లు పడగొట్టాడు. ఫలితంగా ఖఖ= జట్టు 20 ఓవర్లు కూడా ఆడలేకపోయి మొత్తం జట్టు కేవలం 116 పరుగులకే కుప్పకూలింది. సూర్యకుమార్ యాదవ్ కూడా కామియో ఇన్నింగ్స్ ఆడి ముంబై విజయంలో పెద్ద పాత్ర పోషించాడు. అతను తన క్లాసిక్ శైలిలో కేవలం 9 బంతుల్లో 27 పరుగులు సాధించాడు. ఈ చిన్న ఇన్నింగ్స్‌లో అతను 3 ఫోర్లు, 2 సిక్సర్లు కొట్టాడు.

# హైదరాబాద్‌కు సన్ రైజర్స్ గుడ్ బై..?

**- కావ్య మారన్ కు ఏపీ ఆహ్వానం**



హైదరాబాద్ పెన్ సత్తా బీ ఐపీఎల్ 2025 సీజన్ జరుగుతున్న క్రమంలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మధ్య దూరం పెరుగుతోంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అనుచితంగా ప్రవర్తించిందని, బెదిరింపులకు పాల్పడిందని ఎస్ ఆర్ హెచ్ యాజమాన్యం ఆరోపించింది. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే, హైదరాబాద్‌ను వదిలి వెళ్లిపోతామని హెచ్చరించింది. ఎస్ ఆర్ హెచ్ ఆరోపణలను హెచ్సిఏ ఖండించింది. ఉచిత పాస్‌ల విషయంలో (ఐ పి ఎల్ 2025) సన్ రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ( హెచ్సిఏ) మధ్య గొడవలు పతాకస్థాయికి చేరాయి. పాస్ ల కోసం హెచ్సిఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు తీవ్రంగా వేధిస్తున్నాడని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ సంచలన ఆరోపణలు చేసింది. ఇలా చేస్తే హైదరాబాద్ నుంచి వెళ్లిపోతామని బెదిరించింది. ఈ అంశానికి సంబంధించి సన్‌రైజర్స్ జనరల్ మేనేజర్ టిబి శ్రీనాథ్ హెచ్‌సీఏ కోశాధికారి సీజే శ్రీనివాస్ రావు ఓ ఘాటు లేఖ రాశారు. ఉచిత పాస్ ల కోసం హెచ్‌సీఏ ఉన్నతాధికారులు, ముఖ్యంగా అధ్యక్షుడు ఏ జగన్ మోహన్ రావు వేధింపులు తీవ్రమయ్యాయి. ఇలాంటి ప్రవర్తనను మేము ఏమాత్రం సహించం అని ఎస్ ఆర్ హెచ్ యాజమాన్యం తెలిపింది. గత రెండు సీజన్లుగా హెచ్సిఏ తమ సిబ్బందిని తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని, ఈ విషయాన్ని హెచ్సిఏ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి పరిష్కారం రాలేదని ఎస్ ఆర్ హెచ్ తెలిపింది. హెచ్సిఏ ప్రవర్తన చూస్తుంటే, ఈ స్టేడియంలో ఎస్ ఆర్ హెచ్ ఆడేలా చూడకూడదనే ఉద్దేశంతో ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇదే నిజమైతే, బి సి సి ఐ, తెలంగాణ ప్రభుత్వం, మా యాజమాన్యంతో చర్చించి, హైదరాబాద్‌ను వదిలి, కొత్త వేదికను చూస్తామని ఎస్ ఆర్ హెచ్ జనరల్ మేనేజర్ (స్పోర్ట్స్) శ్రీనాథ్ హెచ్చరించారు. గత 12 సంవత్సరాలుగా హెచ్సిఏ తో కలిసిపనిచేస్తున్నాము. గత సీజన్ నుండి మాత్రమే ఈ సమస్యలు, వేధింపులు ఎదుర్కొంటున్నాము. ముందుగా చేసుకున్న ఒప్పందంలో భాగంగా వారికి ప్రతి సీజన్‌లో 50 కాంప్లిమెంటరీ టికెట్లు (ఎఫ్12ఏ బాక్స్) ఇస్తున్నామని ఎస్ ఆర్ హెచ్ జనరల్ మేనేజర్ (స్పోర్ట్స్) శ్రీనాథ్ తమ ప్రకటనలో తెలిపారు. సన్‌రైజర్స్ టీం హైదరాబాద్ నుంచి వెళ్లిపోతుందనే వార్త బయటకు రావడంతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ఈ వివాదంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. సన్ రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యాన్ని హెచ్‌సీఏ బెదిరిస్తోందని వస్తోన్న వార్తల పై సీఎం రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించారు. దర్యాప్తు జరిపి నివేదికను సమర్పించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ డైరెక్టర్ జనరల్ కె శ్రీనివాస్ రెడ్డి ని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్రికెట్ మ్యాచ్‌లకు పాస్‌లు డిమాండ్ చేస్తూ ఎస్ ఆర్ హెచ్ యాజమాన్యానికి ఎవరైనా సమస్యలు సృష్టించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇదిలా ఉంటే సన్‌రైజర్స్ టీం హైదరాబాద్ నుంచి తరలిపోతుందని వస్తోన్న వార్తల పై ఏపీ ఫ్యాన్స్ స్పందిస్తున్నారు. సన్‌రైజర్స్ టీంను ఏపీ కి రావాలని ఫ్యాన్స్ ఆహ్వానం పలుకుతున్నారు. ఏపీకి ప్రత్యేకంగా టీం లేకపోవడంతో, ఇన్నాళ్లు సన్‌రైజర్స్ టీంనే తమ సొంత టీంగా భావిస్తున్నారు. ఇప్పుడు హైదరాబాద్‌లో సన్‌రైజర్స్ ఇబ్బందులు ఎదురు కావడంతో, ఆ జట్టును ఏపీకి రావాలని అభిమానులు స్వాగతం పలుకుతున్నారు.

# అరుదైన రికార్డు సాధించిన సూర్యకుమార్ యాదవ్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌లో ముంబై ఇండియన్స్ ఖాతా తెరిచింది. వాంఖడే స్టేడియం వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అయితే ఈ విజయంలో సూర్యకుమార్ యాదవ్ కీలక పాత్ర పోషించాడు. 9 బంతుల్లో 27 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని కట్టబెట్టాడు. ఈ క్రమంలో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు. టి-20ల్లో 8వేల పరుగుల మైలురాయిని దాటిన ఐదో భారత ఆటగాడిగా సూర్య నిలిచాడు. ఈ జాబితాలో 12,976 (384 ఇన్నింగ్స్) పరుగులతో విరాట్ కోహ్లీ మొదటిస్థానంలో ఉండగా.. ఆ తర్వాతి స్థానంలో 11,838(437 ఇన్నింగ్స్) పరుగులతో రోహిత్ శర్మ ఉన్నాడు. మూడో స్థానంలో శిఖర్ ధవన్(331 ఇన్నింగ్స్‌లో 9797 పరుగులు), నాలుగో స్థానంలో సురేష్ రైనా(319 ఇన్నింగ్స్‌లో 8654 పరుగులు)ఉన్నారు. నిన్నటి మ్యాచ్‌తో 288 ఇన్నింగ్స్‌లో 152.28 స్ట్రైక్‌రేటుతో, 34.21 యావరేజ్‌తో 8007 పరుగులతో సూర్యకుమార్ యాదవ్ ఐదో స్థానంలో నిలిచాడు. ఇక సోమవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతా 116 పరుగులకే ఆలౌట్ కాగా.. ముంబై 12.5 ఓవర్లలోనే 121 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేధించింది.



# ఆ హీరో ఫ్యాన్స్‌లో టెన్షన్



మురుగదాస్.. ఒకప్పుడు ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్లలో ఒకడు. రమణ, గజిని, గజిని (హిందీ), తుపాకి, కత్తి లాంటి బ్లాక్ బస్టర్లతో మురుగదాస్‌కు మామూలు డిమాండ్ ఉండేది కాదు. కానీ మహేష్ బాబుతో 'స్పైడర్' చేసిన దగ్గర్నుంచి ఆయన కెరీర్ తిరగబడింది. తర్వాత సర్కార్, దర్బార్ లాంటి డిజాస్టర్లు వచ్చాయి ఆయన్నుంచి. దీంతో ఒకప్పుడు మురుగదాస్‌తో సినిమాలు చేయడానికి ఎగబడ్డ స్టార్లే తర్వాత ముఖం చాటేశారు. కొన్నేళ్ల పాటు మురుగదాస్ కెరీర్‌లో గ్యాప్ వచ్చేసింది.ఐతే ఈ ఖాళీ తర్వాత ఒకటికి రెండు క్రేజీ ప్రాజెక్టులు సెట్ చేసుకున్నాడు మురుగ. అందులో ఒకటి సల్మాన్ ఖాన్ హీరోగా తెరకెక్కిన 'సికందర్' కాగా.. మరొకటి శివకార్తికేయన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'మదరాసి'. ఈ రెండు చిత్రాల విషయంలో ఆయా హీరోల ఫ్యాన్స్ అంత సంతృప్తిగా లేరు. అనవసరంగా మురుగతో జట్టు కడుతున్నారని వాళ్లు ఫీలయ్యారు. బాలీవుడ్లో అసలే ఫ్లాపుల్లో కొట్టు మిట్టాడుతున్న సల్మాన్ ఖాన్ 'సికందర్'తో మరింత కిందికి వెళ్లిపోయాడు. మరోవైపు గత కొన్నేళ్లలో చాలా వేగంగా ఎదిగిన శివ.. గత ఏడాది 'అమరన్' సెన్సేషనల్ హిట్ అందుకున్నాడు. ఇలాంటి టైంలో కెరీర్‌ను ఇంకాస్త పైకి తీసుకెళ్లే దర్శకుడితో అతను సినిమా చేయాలని ఫ్యాన్స్ కోరుకున్నారు. కానీ అతను ఫాంలో లేని మురుగదాస్‌నే నమ్మాడు. ఈ సినిమా మొదలైన దగ్గర్నుంచి శివ ఫ్యాన్స్ టెన్షన్ పడుతునే ఉన్నారు. ఇలా ఔట్ డేట్ అయిపోయిన డైరెక్టర్లతో సినిమా చేస్తే ఎలాంటి ఫలితం వస్తుందో చాలా ఉదాహరణలు ఉన్నాయి.

# మోక్షజ్ఞ ప్రవేశం ఇంకాస్త ఆలస్యం

నందమూరి అభిమానులు ఎదురుచూసే కొద్దీ మోక్షజ్ఞ ఎంట్రీ లేట్ అవుతూనే ఉంది. గత ఏడాది ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ప్యాన్ ఇండియా మూవీ ప్రకటించి, ఫోటో షూట్ చేసి, ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా వదిలారు. రేపు పూజ అనగా ముందు రోజు రాత్రి క్యాన్సిల్ చేశారు. కొంత అనారోగ్యంతో పాటు మంచి ముహూర్తం కోసం వాయిదా వేశామని బాలయ్య చెప్పినప్పటికీ ఆ తర్వాత సంక్రాంతి, ఉగాది పండుగలు వచ్చి వెళ్లాయి కానీ ఫ్యాన్స్ ఎదురు చూసింది మాత్రం జరగలేదు. ఇంకోవైపు ప్రశాంత్ వర్మ తన ప్రొడక్షన్ సినిమాలతో పాటు జై హనుమాన్ పనుల్లో బిజీ అయిపోయాడు. ఇంకో రెండేళ్ల వరకు దొరకడం అనుమానమే.రెండో సినిమా టేకప్ చేస్తాడని ప్రచారం జరిగిన వెంకీ అట్లూరి కోలీవుడ్ హీరో సూర్యతో కమిటైపోయాడు. ఆ తర్వాత చిరంజీవి, దుల్కర్ సల్మాన్, ధనుష్ లకు వేర్వేరు కథలు సిద్ధం చేసే పనిలో ఉన్నాడు. సో ఈ ఛాన్స్ లేనట్టే. మరో మోక్షజ్ఞ కోసం ఏ దర్శకుడు అందుబాటులో ఉంటాడంటే చెప్పడం కష్టమనేలా పరిస్థితి మారిపోయింది. ఇంతకు ముందు తరచు బయట కనిపించే మోక్షజ్ఞ ఇప్పుడు ఆ దర్శనం కూడా ఇవ్వడం లేదు. మూడు పదుల వయసు అందుకున్న మోక్షు ఇప్పటికే చాలా వెయిట్ చేయించాడని, ఇకనైనా త్వరగా నిర్ణయాలు తీసుకోమని బాలయ్య ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. ఆదిత్య 369 సీక్వెల్ తప్పకుండ ఉంటుందని బాలయ్య నిన్న రీ రిలీజ్ ఈవెంట్ లో చెప్పారు. అందులో మోక్షజ్ఞ ఉంటాడని నెలల క్రితం జరిగిన ఒక ఇంటర్వ్యూలో అన్నారు కానీ నిన్న ఆ ప్రస్తావన రాలేదు. జస్ట్ సీక్వెల్ కన్ఫర్మ్ చేసి టాపిక్ అక్కడితో ముగించారు. ఏది ఏమైనా మోక్షజ్ఞ నిజంగానే సీరియస్ గా పరిశ్రమలోకి రావాలనుకుంటున్నాడా లేదానేది వీలైనంత త్వరగా డిసైడ్ చేసుకోవాలి. ఎందుకంటే పోటీ ప్రపంచంలో మార్కెట్ సృష్టించుకోవడానికి సంవత్సరాలు పడుతుంది. ఒక్క సినిమాతో అయ్యేపని కాదు. బాలయ్య కార్డు డెబ్యూకి పనికొస్తుంది కానీ ఆ తర్వాత కష్టపడాల్సింది మోక్షజ్ఞనే. ఈ సస్పెన్స్ ఎప్పుడు వీడుతుందో.



# బాలయ్యతో మళ్లీ విద్యాబాలన్?

విద్యాబాలన్.. బాలీవుడ్లో మంచి స్థాయి ఉన్న కథానాయిక. ఆమె కథానాయికగా మంచి ఫాంలో ఉన్న టైంలో తెలుగులో నటింపజేయడానికి ప్రయత్నాలు జరిగాయి కానీ.. ఫలితం లేకపోయింది. ఐతే హీరోయిన్ వేషాలు తగ్గిపోయిన టైంలో నందమూరి బాలకృష్ణకు జోడీగా సీనియర్ ఎన్టీఆర్ బయోపిక్ 'యన్.టి.ఆర్'లో నటించింది. అందులో ఆమెది ఎన్టీఆర్ సతీమణి బసవతారకం పాత్ర. సినిమా ఆడలేదు కానీ.. విద్యా చాలా బాగా నటించి మెప్పించింది. బాలయ్యతో ఆమెకు జోడీ కూడా బాగానే కుదిరింది. రిజల్ట్ గురించి ఆలోచించకుండా ఇప్పుడు మళ్లీ విద్యాతో బాలయ్య నటించబోతున్నట్లు సమ్మాచారం. ఆయన కొత్త చిత్రం 'అఖండ-2'లో ఒక కీలక పాత్ర పోషించబోతున్నట్లు సమాచారం. విద్యా కథానాయికల్లో ఒకరా అన్న దానిపై స్పష్టత లేదు. కానీ ఆమె ఈ చిత్రంలో నటిస్తుండడం మాత్రం వాస్తవమట. 'అఖండ'కు సీక్వెల్ కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. 'అఖండ' ఓటీటీలో రిలీజయ్యాక హిందీ ప్రేక్షకులు కూడా ఎగబడి చూశారు. దీంతో ఈసారి సీక్వెల్‌ను పాన్ ఇండియా స్థాయిలో భారీగా రిలీజ్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకే ఆర్టిస్టులను కూడా వేర్వేరు భాషల నుంచి తీసుకుంటున్నారు. విద్యా నటిస్తే హిందీ ఆడియన్స్ బాగానే కనెక్ట్ అవుతారు.



"PEN SATTA" Telugu Daily Printed, Published and owned by CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Published at D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Cell : 98853 15759, RNI.NO.APTEL/2023/87729, E-mail:anilchintamaneni@gmail.com